పూర్తిగా ఉపవాసం ఉండమని నేను మీకు సూచించను. మీరు తీసుకునే ఆహార పరిమాణాన్ని తగ్గించవచ్చు. ఉదాహరణకు, మీరు ఒక పూర్తి భోజనం తీసుకునేవారైతే, దానిని సగం లేదా పావు వంతుకు తగ్గించుకోవచ్చు. అలాగే, రోజంతా ఏదో ఒకటి తింటూ ఉండకండి. చాలామందికి రోజంతా ఏదో ఒకటి నములుతూ ఉండే అలవాటు ఉంటుంది---అలా చేయకండి. ఇతర ఇంద్రియ సంబంధిత కార్యకలాపాలకు దూరంగా ఉ ండండి. మీ పంచేంద్రియాలకు గాఢమైన విశ్రాంతిని ఇవ్వండి. అనవసరమైన స్పర్శలు, సినిమాలు చూడటం, లేదా నిరంతరం ఐపాడ్ (ఐ్రాశీస)లో సంగీతం వినడం వంటివి చేయకండి. చాలామంది నిద్రలేవగానే రేడియో ఆన్ చేయడం లేదా ఐపాడ్ పెట్టుకోవడం చేస్తుంటారు. జాగింగ్ చేస్తున్నప్పుడు కూడా ఏదో ఒకటి వింటూనే ఉంటారు. ఇలా మనస్సు నిరంతరం శబ్దాలు, సంగీతంతో నిండిపోతుంది. నవరాత్రుల సమయంలో మీ వ్యవస్థపై ఇటువంటి సంగీత భారాన్ని వేయకండి.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ



www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 345 | శుక్రవారం | 16 అక్టోబర్ 2026 | పేజీలు : 04 వెల ₹5

# సీజేఐ ధర్మాసనం సీరియస్

## విపక్షాలపై విరుచుకుపడుతూ నోటీసులు

## రాహుల్ గాంధీ, ఖర్గే, అఖిలేష్‌తో పాటు పలువురికి..

సుప్రీం కోర్టు ప్రాంగణంలోప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసన, పాదయాత్రపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. న్యాయవ్యవస్థను ఎవరూ భయపెట్టలేరని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం నిర్ణయాలను సవాలు చేస్తూ రాహుల్గాంధీ, ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.



04

# జంతర్ మంతర్‌పై జవాబొచ్చాకే

## డీ నోటిఫై చేయడంపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

## ఎలాంటి పరిశీలనల ఆధారంగా నిర్ణయించారని ప్రశ్న?

## జవాబులు రానివ్వండి.. సంతృప్తికరంగా లేకపోతే చట్టం తన పని తాను చేస్తుందని ధర్మాసనం వ్యాఖ్య

దేశ రాజధాని నగరంలోని నిర్ణీత నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్ను తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఈ నిర్ణయం ప్రభుత్వమౌఖికపరిశీలనల ఆధారంగా తీసుకున్నారా? లేక నిరసన వేదికగా జంతర్ మంతర్ యోగ్యతను అంచనా వేసిన తర్వాత తీసుకున్నారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.



# సింగరేణికి మరణశాసనం

- ప్రతి టన్నుపై రూ.1,500 చొప్పున కమీషన్: కేటీఆర్
- 'భోత్రా' చేసుకొన్న అగ్రిమెంట్లు బయటపెట్టాలి.. ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారో వెల్లడించాలి
- విదేశీ బొగ్గు దిగుమతితో సింగరేణికి మరణశాసనం
- కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరుపాలి
- బొగ్గు స్కామ్ ఆపాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లేఖ

విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో రూ.3 వేల కోట్ల దోపిడీకి కుట్ర జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు విమర్శించారు. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో సీఎం రేవంత్‌రెడ్డి ముందే చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. సింగరేణిలో బొగ్గు కొరత ఉన్నదంటూ కృత్రిమ సంక్షోభం సృష్టించి, అదును చూసి భోత్రా లాజిస్టిక్స్‌ను రంగంలోకి దించారని చెప్పారు.

వివరాలు 3లో..

## నీ ఉద్యోగం ఊడడం ఖాయం రేవంత్

### రైతు బీమాను నిలిపివేయడంతో 3 వేల.. కుటుంబాలు రోడ్డునపడ్డాయి: హరీశ్‌రావు

# 'యాసంగి' యావొద్దు

## ఎల్ నినో ఎఫెక్ట్‌తో రాష్ట్రంలో సంక్షోభం

- యాసంగి సాగును వాయిదా వేసుకోవాలి
- రైతులు పెద్దమనసు చేసుకొని సహకరించాలి
- రాబోయే 8, 10 నెలలు రాష్ట్రంలో గడ్డుకాలం
- నీటికి, విద్యుత్‌కు తీవ్ర కొరత తప్పదు
- ప్రస్తుతం ఉన్న నీటినే పొదుపుగా వాడుకోవాలి
- పంటకు మళ్లిస్తే నారుమళ్లకే సరిపోతుంది
- ఈ నీటిని తాగునీటికే వాడుకుందాం
- 'ఎల్‌నినో'పై క్యాబినెట్ సబ్‌కమిటీ
- దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం
- వచ్చేనెల ఢిల్లీకి అఖిలపక్ష బృందం: రేవంత్
- మంత్రులతో ముఖ్యమంత్రి సమావేశం

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నాయని, సాగునీటి, తాగునీటి ఎద్దడి తలెత్తుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పెద్దమనసు చేసుకుని యాసంగిలో పంట వేయకుండా వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే 8, 10 నెలల కాలంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి

మిగతా 2 లో



# వ్యవస్థీకృత దోపిడీకి మార్గంగా 22 ఏ

- కాంగ్రెస్ అవినీతి సంపాదనకు ప్రధాన ఆదాయ వనరు అదే..
- లక్షల మంది భూ యజమానులు, రైతులకు తీవ్ర వేధింపులు
- బాధితులందరికీ న్యాయం చేయాల్సిందే: రాంచందర్‌రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలున్నాయి: ఏలేటి

రాష్ట్రంలో 22-ఏ (నిషేధిత జాబితా) పేరుతో వ్యవస్థీకృత భూదోపిడీ జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు దుయ్యబట్టారు. లక్షలాది మంది భూ యజమానులు, రైతులు తీవ్ర వేధింపులకు గురవుతున్నారన్నారు. పట్టా భూము లు, వ్యవసాయ క్షేత్రాలు, ప్లాట్లను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తూ, వాటి తొలగింపు పేరుతో భారీ అవినీతి దందాకు తెరలేపారని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.



03

# భూభారతికి ఆధార్ అనివార్యం

- మ్యుటేషన్, ఫౌతి మ్యుటేషన్,డేటా సవరణ తదితరాలకు..
- సీసీఎల్ఏ ఉత్తర్వులు




భూభారతి పోర్టల్ ద్వారా అందించే పలు సేవలకు ఆధార్ అథెంటికేషన్(ధ్రువీకరణ) తప్పనిసరి చేస్తూ సీసీఎల్ఏ డీఎస్ లోకేశ్ కుమార్ ఉత్తర్వులిచ్చారు.

02



# హార్మోజ్ జలాల్లో ఐఫోన్లు

04

- హార్ముజ్‌లో రెండు నౌకలు మునక
- ఇరాన్ దాడులు తీవ్రతరం..
- 48 గంటల్లో ఐదు ఘటనలు

# 'యాసంగి' యావొద్దు

మొదటి పేజీ తరువాయి

ఉందని, రాష్ట్ర ప్రజలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వ ఉపశమన చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు. గురువారం అందుబాటులో ఉన్న మంత్రులతో ముఖ్యమంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై సుదర్ఘీంగా చర్చించారు. అనంతరం పలువురు మంత్రులతో కలిసి రేవంత్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఎండ వేడిమి వంటి రకరకాల సమస్యలు ఉత్పన్నమవుతాయంటూ శాస్త్రవేత్తలు చెబుతున్నారని తెలిపారు. "దురదృష్టవశాత్తు వాళ్లు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోతున్నాయి. 2019-20లో కొవిడ్ పరిస్థితుల కారణంగా ప్రపంచమే స్తంభించిపోయింది. అలాంటి సంక్షోభాన్ని ఈ రోజు ఎదుర్కొంటున్నాం. ఈ సమస్యను ఎదుర్కోవడానికి, ప్రజలను, జీవరాశులను కాపాడడానికి అందుబాటులో ఉన్న మంత్రులందరినీ పిలిపించి, చర్చించడం జరిగింది. వివిధ శాఖల కార్యదర్శులతో కూడా చర్చించి కొంత కార్యాచరణను రూపొందించాం" అని సీఎం వివరించారు. "ఈరోజు ఒక ప్రకృతి విపత్తును ఎదుర్కొనబోతున్నాం. ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన సందర్భం. సాగునీరు, తాగునీరు లేకపోవడం, పరోక్షంగా విద్యుత్తు వినియోగం పెరగడం, విద్యుత్తు ఉత్పత్తి తగ్గడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇది పరిశ్రమలు, ప్రజా జీవితం, దినసరి కార్యక్రమాలపై తీవ్రమైన ప్రభావం చూపబోతుంది. అందుకే వర్షాకాల పంటల సందర్భంలోనే ప్రజలకు విజ్ఞప్తి చేశాం. వర్షాధార పంటలను తక్కువగా వేయాలని చెప్పాం. మేము చెప్పడం వల్ల 13 లక్షల ఎకరాల్లో వరి పంటను వేయకుండా ఇతర పంటల వైపు రైతులు మళ్లారు. అయినా... 56 లక్షల వరకు వరిని పండించారు. నిజానికి అక్టోబరులో రోజుకు 15 వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండాలి. కానీ... అది 20 వేల మెగావాట్లకు పెరిగింది. ఎండాకాలంలో ఉండాల్సిన ఎండలు అక్టోబరులో ప్రభావం చూపాయి. అయినా 23వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా, అవసరమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నాం. రాష్ట్ర ఆవిర్భావం సందర్భంలో 6-7వేల మెగావాట్ల డిమాండ్ ఉండేది. ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్లు అదనంగా పెరిగింది. అయినా... విద్యుత్తుశాఖ సమర్థంగా పని చేసి విద్యుత్తును అందించడానికి కృషిచేస్తోంది"అని సీఎం అన్నారు.




### మార్కెట్‌లో విద్యుత్ దొరకడంలేదు..

చేతికి వచ్చే పంట ఎండిపోకూడదని, విద్యుత్‌ను కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. "రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు కూడా ఈ విద్యుత్తు సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రూ.14-15లకు యూనిట్ విద్యుత్తును కొనుగోలు చేస్తోందని, మనం ఎంత చెల్లించి కొందామన్నా.. మార్కెట్‌లో విద్యుత్తు దొరకని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అందరినీ ఆదుకోవడానికి, పంటలు దెబ్బతినకుండా ఉండడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. "కృష్ణా బేసిన్‌లో ఈ సంవత్సరం 72 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. గోదావరి బేసిన్‌లో 40 శాతం తక్కువగా ఉంది. వర్షపాతం 23 శాతం తక్కువగా ఉండడం వల్ల ఈ పరిస్థితులు ఉన్నాయి. ఏ రిజర్వాయర్లలో కూడా నీరు లేక, వట్టిపోయే పరిస్థితుల్లో ఉన్నాయి. 24 వేల గ్రామాలకు తాగునీటిని అందించాల్సిన పరిస్థితి ఉంది. ప్రజలను అప్రమత్తం చేసి, కేంద్రం నుంచి ఎలా సహకారం తీసుకోవాలో సమీక్షించాం. ప్రస్తుత పంటకు సంబంధించి 11, 12 లక్షల ఎకరాలకు ఇబ్బందిగా ఉంది. ఒక్క ఎకరా ఎండిపోకుండా ఉండడానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. గ్రేటర్ హైదరాబాద్‌కు వచ్చే సింగూరు, ఎల్లంపల్లి, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటిని పొదుపుగా వాడుకోవాలని నిర్ణయించాం. సాగుకు నీటిని తగ్గించుకుంటూ.. వచ్చే 8-10 నెలలు గడపాలి. గతేడాది ఇదే కాలం నాటికి 462 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఈసారి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ నీరు నారుమళ్లకే సరిపోతుంది. ఆ తర్వాత పంటకు ఇవ్వలేం. తాగునీటికి సమస్య తలెత్తుతుంది. అందుకే రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని సీఎం అన్నారు.

### నీళ్లను కొనుక్కోలేం..

అందుబాటులో ఉన్న 209 టీఎంసీలను పొదుపుగా వాడుకోవాలని, కేవలం తాగునీటి కోసమే వినియోగించాలని సీఎంసూచించారు. ఎవరి తప్పుడు ప్రచారాలనైనా నమ్మి వరి పంటను వేస్తే.. పెట్టుబడి నష్టపోతారని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పేలిపోయే అవకాశం ఉందన్నారు. కూలీలకు పని దొరికే అవకాశం ఉండదని, అందుకే ఉపాధి హామీ ద్వారా పూర్తి స్థాయి పనులను చేపట్టాలని అధికారులకు చెప్పామన్నారు. "భూమి ఉన్న రైతులకు ఇప్పటి పంటకుగాని, రేపు వేసుకోవాల్సిన పంటకు సంబంధించి కేంద్రం సహకరించాలి. కేంద్ర సౌజన్య పథకాల కింద 60శాతం నిధులను కేటాయించాలి. ఈ విషయమై మంత్రివర్గ ఉప సంఘం త్వరలోనే అఖిలపక్షాన్ని పిలిచి భేటీ అవుతుంది" అని సీఎం వివరించారు.

### విద్యుత్తు సంక్షోభం...

ప్రస్తుతం రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం నమోదవుతోందని, ఇది ఆషామాషీ వ్యవహారం కాదని సీఎం రేవంత్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం, పైశాచిక ఆనందం పొందేవాళ్లకు ఇది కనపడదని వ్యాఖ్యానించారు. ఈ సమస్య నుంచి గట్టెక్కడానికి కేంద్ర ప్రభుత్వ సహకరించాలని, రాష్ట్రానికి అదనంగా విద్యుత్తును అందించాలని కోరాలని నిర్ణయించామన్నారు. "కొంత తక్కువ ధరకు విద్యుత్ ఇవ్వాలి. రైతులకు అవసరమైన విద్యుత్తును కొనుగోలు చేసి, ప్రతి వ్యక్తి అవసరాలను తీర్చాలని అనుకుంటున్నాం. కేంద్రానికి నిధులు చెల్లించైనా విద్యుత్తును తీసుకోవాలని నిర్ణయించాం. కొవిడ్ సందర్భంగా ప్రధానమంత్రి గుళ్లలో గంటలు కొట్టాలన్నా, వీధిలో పళ్లాలు కొట్టాలన్నా కొట్టాం. ఆ రోజు పార్టీలు అని చూడలేదు. ఈరోజు రాజకీయ పార్టీలు అదే స్ఫూర్తిని ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. కలిసికట్టుగా ఈ విపత్తును ఎదుర్కొనడానికి నిలబడాలి" అని అన్నారు. పశు సంపదను జాగ్రత్తగా కాపాడుకోవాలని, పశుగ్రాసం, తాగునీటి కోసం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ప్రభుత్వం, ముఖ్యమంత్రి, అధికారులు నూటికి నూరు శాతం ప్రయత్నించడంతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలి. కేంద్రం సహకరించాలని అన్నారు.

# 30 వేల కోట్లు అడుగుదాం!

**కేంద్రం కరువు సాయంపై అధికారుల ప్రతిపాదనలు**

**315 మండలాల్లో కరువు పరిస్థితులపై అంచనాలు**

**11.18 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం**

**యాసంగిలో సాగు చేయని పంటలకు పరిహారం**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** కరువు పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలంటూ కేంద్రాన్ని కోరాలని అధికారులు ప్రతిపాదించారు. సచివాలయంలో గురువారం జరిగిన సీఎం, మంత్రుల సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు ఎల్‌నినోపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీంట్లో భాగంగా కేంద్రం సాయం గురించి ప్రతిపాదనలు చేశారు. చెరువులు, నీటి వనరుల పునరుద్ధరణకు రూ.3,552 కోట్లు, కీలక సాగునీటి ప్రాజెక్టులకు రూ.16,448 కోట్లు, పంపింగ్-లిఫ్టింగ్ అవసరాలకు విద్యుత్ రాయితీ కింద రూ.10 వేల కోట్లు కోరాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, పౌరసరఫరాలు, పశుసంవర్ధకశాఖ, సాగు, తాగునీరు, జలమండలి, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ, సాంస్కృతికశాఖల అధికారులు తమ శాఖల పరిధిలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవటానికి అవసరమైన భవిష్యత్ కార్యాచరణను సీఎం రేవంత్‌కు, మంత్రులకు వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోగా.. సాగులో ఉన్న పంటలపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 315 మండలాల్లో కరువు పరిస్థితులున్నట్లు ప్రాథమికంగా అంచనా వేయగా.. ఇందులో 101 తీవ్ర, 214 మధ్యస్థ కరువు ప్రభావిత మండలాలు అని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబరు 30 వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లు నమోదుకావాల్సి ఉండగా.. 615.5 మి.మీ. మాత్రమే కురిసిందని వివరించారు. అక్టోబరు 15వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 795.7 మి.మీ. పడాల్సి ఉండగా, 615.8 మి.మీ. మాత్రమే నమోదైందని, లోటు 23 శాతానికి పెరిగినట్లు తెలిపారు. గతేడాది 139.28 లక్షల ఎకరాల్లో సాగు జరగ్గా.. ఈ ఏడాది 126.06 లక్షల ఎకరాలకే పరిమితమైందని, 13.22 లక్షల ఎకరాల సాగు తగ్గినట్లు వెల్లడించారు. వరి సాగు 69.19 లక్షల ఎకరాల నుంచి 57.04 లక్షల ఎకరాలకు పడిపోయినట్లు వివరించారు. సుమారు 8.93 లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినగా.. దిగుబడి 50% వరకు తగ్గే ప్రమాదముందని అంచనా వేశారు. వరి 1.20 లక్షల ఎకరాల్లో ప్రభావితమై, దిగుబడిలో 30-35% తగ్గుదల ఉండవచ్చని పేర్కొన్నారు. జిల్లాలవారీగా చూస్తే నల్లగొండలో 3.58 లక్షల ఎకరాలు, జోగులాంబ గద్వాలలో 1.45 లక్షల ఎకరాలు, నాగర్‌కర్నూల్‌లో 1.41 లక్షల ఎకరాలు, రంగారెడ్డిలో 1.29 లక్షల ఎకరాలు ప్రభావితమైనట్లు తెలిపారు. పంట నష్టంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలని అధికారులు ప్రతిపాదించారు. విత్తన రాయితీలు, సూక్ష్మసేద్యం, ఉద్యానవన పంటల ప్రోత్సాహకాలు కలిపి మొత్తం రూ.1,986.89 కోట్ల వ్యవసాయ సహాయ ప్యాకేజీని ప్రతిపాదించారు. యాసంగి 2026-27లో వరి సాగు చేయని రైతులకు కూడా ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందించే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు సూచించారు.

### నీటి నిల్వలు ఆందోళనకరం

జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకరంగా ఉండటంతో సాగునీటిని పరిమితంగా విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అధికారుల ప్రజెంటేషన్ ప్రకారం, ప్రాజెక్టుల్లో 466 టీఎంసీల సాధారణ నిల్వ ఉండాల్సినప్పటికీ, ప్రస్తుతం 209.45 టీఎంసీలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చి, మిగిలిన నీటిలో 47 టీఎంసీలను వినియోగించి సుమారు 7 లక్షల ఎకరాలకు ఒక్క తడి మాత్రమే అందించాలని అధికారులు ప్రతిపాదించారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో రైతులు పంట విరామం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. 2027 జూలై వరకు తాగునీటి అవసరాలకు 85 టీఎంసీలను ప్రత్యేకంగా నిల్వ ఉంచాలని పేర్కొన్నారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాపై ప్రభావం పడుతోందని ఈ సమావేశంలో అధికారులు వివరించారు. హైదరాబాద్‌కు రోజుకు సుమారు 560 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు గుర్తుచేశారు. సింగూరు, మంజీరా నుంచి వచ్చే నీటిలో కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయాలపై ఆధారపడాల్సి వస్తుందని.. కృష్ణా నుంచి నీటిని పంపింగ్ చేయడం, మిషన్ భగీరథ సరఫరాలో మార్పులు, గోదావరి నీటిని అదనంగా వినియోగించడం వంటి చర్యలను ప్రతిపాదించారు. నిర్మాణ పనులు, ఇతర అవసరాలకు తాగునీరు, బోరుబావుల నీటిని వినియోగించడంపై క్యూర్ పరిధిలో ఆంక్షలు విధించే అంశాన్ని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితిని బట్టి మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేయాల్సిన అవసరం రావచ్చని అంచనా వేశారు.

# పతకాలు కేవలం అంకెలు కావు.. భారత శక్తికి ప్రతీకలు: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాలు కేవలం అంకెలకు మాత్రమే పరిమితం కాదని, అది క్రీడా రంగంలో భారత దేశ శక్తికి ప్రతీకని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆసియా క్రీడలు 2026లో పతకాలు సాధించిన అథ్లెట్లను ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో ప్రధాని మోదీ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. దేశానికి కీర్తి తెచ్చిన అథ్లెట్లందరినీ అభినందిస్తూ.. ఈ విజయాలు మొత్తం 140 కోట్ల మంది దేశప్రజలందరివని మోదీ స్పష్టం చేశారు. 'ఈ పతకాలు కేవలం సంఖ్యలు కావు. ఇవి ఒక నూతన భారతదేశ శక్తిని ప్రతిబింబిస్తాయి. ప్రపంచ వేదికలపై మన దేశ త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరవేయడమే అత్యున్నత విజయం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ క్రీడా వేడుకలో మహిళా అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరిచారని ప్రశంసించారు. మహిళా అథ్లెట్లు ఏకంగా 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలను సాధించడం విశేషమని ప్రశంసించారు. అలాగే క్రికెట్, హాకీ జట్లతో పాటు ఐదు స్వర్ణ పతకాలు గెలుచుకున్న ఆర్చరీ క్రీడాకారుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. యువ అథ్లెట్లు ప్రధానికి తమ సంతకం చేసిన జెర్సీలు, 17 ఏళ్ల ఆర్చరీ క్రీడాకారిణి కుంకుమ్ మోహోద్ విల్లును జ్ఞాపికగా బహుకరించారు. దేశ క్రీడా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టిస్తున్న ఈ విజేతలు రాబోయే రోజుల్లో అంతర్జాతీయ వేదికలపై మరింతగా రాణించి దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. జపాన్ వేదికగా జరిగిన ఆసియా క్రీడలు 2026 టోర్నీలో 21 స్వర్ణాలతో సహా మొత్తం 85 పతకాలను సాధించి భారత్ అసాధారణ ప్రదర్శన కనబరిచింది.

# రూ.38,000కోట్లకు పెరిగిన రక్షణ ఎగుమతులు

### కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ:** భారతదేశం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాలకు స్వదేశీ రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ అన్నారు. భారతదేశ రక్షణ ఎగుమతులు 2013-14లో కేవలం రూ.686 కోట్ల నుంచి 2025-26 నాటికి రూ.38,000 కోట్లకు పైగా పెరిగాయని ఆయన చెప్పారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన డిఫెన్స్ కానక్లేవ్ 2026లో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ, ఆయుధాల రకాలలో భారతదేశం 90 శాతం పైగా స్వావలంబనను సాధించింది అని తెలిపారు. ప్రస్తుతం భారత సైన్యం వద్ద ఉన్న 175 రకాల ఆయుధాలలో 150 స్వదేశీవేనని ఆయన నొక్కి చెప్పారు. గత పన్నెండున్నర సంవత్సరాలలో రక్షణ రంగం తన సామర్థ్యాలను విస్తరించుకోవడమే కాకుండా, జాతీయ భద్రతను బలోపేతం చేసే విధానంలో ఒక ముఖ్యమైన వ్యూహాత్మక మార్పును కూడా సాధించిందని అన్నారు. ఏ సవాలునైనా ఎదుర్కోవడానికి భారత సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి అన్నారు. ఆపరేషన్ సింధూర్, బాలాకోట్ వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రైక్స్ సైనిక చర్యలు మాత్రమే కాదని, అవి దేశ వైఖ లో ఒక నిర్ణయాత్మక మార్పునకు ప్రతీకలని మంత్రి చెప్పారు. సరిహద్దు ఉగ్రవాదంపై భారతదేశ వైఖరిని పునరుద్ఘాటిస్తూ, పాకిస్థాన్ నుంచి మరిన్ని ఉగ్రవాద చర్యలు జరిగితే మరింత బలమైన ప్రతిస్పందన ఉంటుందని రాజ్నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

# 28లోగా దేశం విడిచి వెళ్లండి!

### నటుడు ఇమ్రాన్ ఖాన్ ను కోరిన ముంబై పోలీసులు

**ముంబై:** నటుడు ఇమాన్ ఖాన్ను ఈ నెల 28వ తేదీలోగా భారతదేశం విడిచి వెళ్లాలని ముంబై పోలీసులు గురువారం కోరారు. ముంబై పోలీసుల ప్రకారం, నటుడు ఇమ్రాన్ ఖాన్ భారత పౌరుడు కానందున, ఇమ్మిగ్రేషన్ చట్టంలోని నిబంధనల కింద అతనికి లీవ్ ఇండియా నోటీసు జారీ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇమ్రాన్ ఖాన్ ముంబైలోని ఆగస్ట్ క్రాంతి మైదాన్లో లో జరిగిన నిరసనలో పాల్గొన్నారు. ఈ సమయంలో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ వ్యాన్లో లో కూర్చున్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. భారతీయ పౌరుడు కానప్పటికీ నిరసనలో పాల్గొన్నందుకు చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం సదరు పె కారం సదరు నటుడిపై చర్యలు తీసుకున్నట్లు ముంబైపోలీసులు తెలిపారు. కాగా, తనకు పారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఎస్‌ఆర్‌ఆర్) ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ చట్టపరమైన పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ఆయన తరపు న్యాయవాది జుల్ఫికర్ మెమన్ తెలిపారు.

# హార్మోజ్ జలాల్లో ఐఫోన్లు

### సముద్రంలో తేలియాడుతున్న ఐఫోన్లు

### ఇరాన్ దాడులు తీవ్రతరం.. 48 గంటల్లో ఐదు ఘటనలు

**టెహరాన్:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ హార్ముజ్ జలసంధి సమీపంలో రెండు కంటైనర్ నౌకలు క్షిపణి దాడులకు గురై సముద్రంలో మునిగిపోయాయి. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత వాణిజ్య నౌకలపై దాడులు ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారని అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. కీలకమైన హార్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పూర్తిగా అడ్డుకోవడం ద్వారా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్పై ఒత్తిడి పెంచేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాలో నవంబరు 3న జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ముందు ఇంధన ధరలను తగ్గించేందుకు ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకు న్నాయి. హార్ముజ్ ప్రాంతంలో గత 48 గంటల్లో ట్యాంకర్లు సహా వాణిజ్య నౌకలపై డ్రోన్ దాడులతో కలిపి కనీసం 5 ఘటనలు చోటుచేసుకున్నట్లు బ్రిటన్కు చెందిన యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకేఎంటీఓ) బుధవారం వెల్లడించింది.

### మైనన్ను ఢీకొని మునిగిందన్న ఇరాన్

సింగపూర్ జెండాతో ప్రయాణిస్తున్న జీఎఫ్ఎస్ ఫ్రైడ్ అనేకం టైనర్ నౌక మంగళవారం దాడికి గురికాగా.. బుధవారం సముద్రంలో మునిగిపోయింది. కొన్ని గంటల తర్వాత ఆంటిగ్వా, బార్బుడా జెండాతో ప్రయాణిస్తున్న కేప్ డావో నౌక కూడా జలసంధికి సమీపంలో మునిగింది. జీఎఫ్ఎస్ ఫ్రైడ్ ఘటనను ఉద్దేశిస్తూ ఇరాన్ మరో వాదనను తెరపైకి తెచ్చింది. అనుమతి లేని మార్గంలో హార్ముజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన సమయంలో ఆ నౌక సముద్రంలో అమర్చిన నావికా మందుపాతరను ఢీకొని మునిగిపోయిందని పేర్కొంది. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటనలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రమాద సమయంలో నౌక ఒకవైపునకు ఒరిగిపోయి, దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యాలను ప్రసారం చేశారు. ఆ నౌకలో 2,500 కంటైనర్లు ఉన్నట్లు సమాచారం. కంటైనర్ల నుంచి బయటకు వచ్చిన ఐఫోన్లు, పెర్ఫ్యూం బాటిళ్ల బాక్సులు సముద్రంపై భారీగా తేలియాడాయి. దీనికి సంబంధించిన వీడియో ఒకటి గురువారం వెలుగులోకి వచ్చింది.

# దిగుమతి బొగ్గుపై కేటీఆర్ అడిగిన ఏ విచారణకైనా సిద్ధమే

**పంచపాండవుల చెరువు నుంచి కేసీఆర్ ఫామ్‌హస్‌కు నీళ్లు**

**ఆయనకు ఎందుకీ ప్రత్యేక సౌకర్యం?.. నిజనిర్ధారణ కమిటీ వేద్దామా?**

**యాదాద్రి పవర్ ప్లాంట్‌తో రూ. 50వేల కోట్ల భారం**

**తెలంగాణకు కృష్ణా జలాల్లో మరణశాసనం రాసిందెవరు?**

**చంద్రబాబు ముందు మోకరిల్లి సంతకం పెట్టింది మీరు**

**తీవ్రస్థాయిలో మండిపడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**యాదాద్రి పవర్ ప్లాంట్‌తో రూ. 50వేల కోట్ల భారం: సీఎం రేవంత్**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** "బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెప్పడం ఆపనంతకాలం మేం నిజాలు చెబుతూనే ఉంటాం. మేం నిజాలు చెబితే మీకు తలకాయ ఎక్కడ పెట్టుకోవాలో తెలియదు" అని సీఎం రేవంత్ మండిపడ్డారు. పంచపాండవుల చెరువు నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 400 ఎకరాలకు నీళ్లు వెళ్తున్నాయని ఆరోపించారు. తెలంగాణకు కృష్ణాజలాల విషయంలో శాశ్వత మరణ శాసనం రాసింది బీఆర్ఎస్ పార్టీయేనని.. యాదాద్రి ప్లాంట్‌తో రాష్ట్రానికి రూ.50 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ధ్వజమెత్తారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం.. కాంగ్రెస్ వల్లనే కరువు వచ్చిందని బీఆర్ఎస్ అనడం వాళ్ల పైశాచిక ఆనందానికి నిదర్శనమని దుయ్యబట్టారు. "ఏపీ, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు బ్రిటన్, జపాన్ లాంటి దేశాల్లో కాంగ్రెస్ పార్టీ ఉందా? అక్కడ కరువు ఎందుకుంది? 100 దేశాల్లో ఎల్ నినో సమస్య ఉంది. బీఆర్ఎస్ నేతలు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు." అని ధ్వజమెత్తారు. "కొండపోచమ్మ నుంచి పంచపాండవుల చెరువుకు ఒక కాలువ తవ్వారు. పంచపాండవుల చెరువు నుంచి నేరుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోని 400 ఎకరాలకు నీళ్లు అందిస్తున్నారు. రాష్ట్రంలో ఎవ్వరికీ లేని ప్రత్యేక వెసులుబాటు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే ఎందుకు? దీనిపై నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేద్దామా? పంపు కనెక్షన్‌ను తొలగించడానికి కేసీఆర్ ముందుకు వస్తారా?"అని నిలదీశారు. విద్యుత్ సంక్షోభం రాబోతోంది.. 1,040 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్లాంట్, 4,000 మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కేసీఆర్ హడావుడి చేశారని, నామినేషన్ బేసిస్‌పై ప్లాంట్లు ఇస్తున్నట్లు ఆయనే స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారని సీఎం రేవంత్ గుర్తుచేశారు. "అందులో అవినీతి ఉందని నాడు మేం వ్యతిరేకించాం. మూడేళ్లలో రూ.17,950 కోట్లతో యాదాద్రి సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్టు కట్టడానికి బీహెచ్‌ఈఎల్‌తో ఒప్పందం చేసుకున్నారు. అది పూర్తి కాక వ్యయం రూ.37,781 కోట్లకు పెరిగింది. దీనికి బాధ్యులు ఎవరు?" అని ప్రశ్నించారు. బొగ్గు, నీళ్లు అందుబాటులో ఉండే ప్రాంతంలోనే పవర్ ప్రాజెక్టులు కడతారని.. కానీ యాదాద్రిని సింగరేణి ప్రాంతంలో కాకుండా దామరచర్లలో నిర్మించారని.. సింగరేణిని నిండా ముంచి ఈ ప్రాజెక్టును కట్టారని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి ప్రాజెక్టును మణుగూరు ప్రాంతంలో కట్టి ఉంటే ఖర్చు తగ్గేదని అభిప్రాయపడ్డారు. "యూనిట్ రూ.4.62కు మణుగూరులో విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. యూనిట్ రూ.3.94 చొప్పున కొత్తగూడెంలో, సింగరేణి1, 2లో యూనిట్ రూ.4.05 చొప్పున విద్యుత్‌ఉత్పత్తి అవుతోంది. యాదాద్రిలో యూనిట్ రూ.6.60 అవుతోంది. ఫలితంగా యాదాద్రి వల్ల రూ. 50 వేల కోట్ల అదనపు భారం పడుతుంది. వచ్చే 25 ఏళ్లలో లక్ష కోట్ల నష్టం జరగనుంది" అని ఆందోళన వెలిబుచ్చారు. ఆ ప్లాంటులో గ్రేడ్ 9 బొగ్గు వద్దు, ఏదైనా నడుస్తుందని ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు అంటున్నారని.. కానీ, గ్రేడ్ 9 కాకుండా మిగిలిన రకాల (గ్రేడ్ 18 దాకా ఉంటాయి) బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి వాడితే బూడిద ఎక్కువగా వస్తుందని సీఎం తెలిపారు. యాదాద్రి ప్లాంటుకు అవసరమైన గ్రేడ్ 9 బొగ్గు లభ్యత సింగరేణిలో 2 మిలియన్ టన్నులు మాత్రమే ఉందని.. 141 టెండర్లు జరిగితే ఒక్కదాంట్లో కూడా సింగరేణి పాల్గొనకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని మండిపడ్డారు. "దిగుమతి బొగ్గు కోసం టెండర్లలో పాల్గొనలేదు. 100 శాతం దిగుమతి చేసుకోవాలన్న ఉద్దేశంతో ఎన్జీటీలో కేసు వేయించి స్టే ఇప్పించారు. యాదాద్రికి కావాల్సిన మొత్తం 14 మిలియన్ టన్నుల బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితిని తెచ్చారు. కానీ, మేం 2024లో ప్రజాభిప్రాయ సేకరణ చేయించి, సింగరేణి బొగ్గును మాత్రమే వాడుతామని తీర్మానం చేయించి ఎన్జీటీలో స్టే ఎత్తివేయించాం" అని సీఎం గుర్తుచేశారు. "యాదాద్రిలో ఐదో యూనిట్ ఇంకా పూర్తి కాలేదు. నైనీ కోల్ నుంచి రోజుకు రెండు, మూడు ర్యాక్‌లు తీసుకొచ్చి యాదాద్రిలో విద్యుదుత్పత్తి మొదలుపెట్టాం. బొగ్గు కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో ఈ రోజు నేను మాట్లాడాను. దేశీ బొగ్గునే యాదాద్రిలో వాడటానికి మేం ప్రయత్నాలు చేస్తున్నాం. డ్రగ్స్, ఫామ్‌హౌస్, స్టార్ హోటళ్లు, 22 ఏ వంటి అంశాల్లో కేటీఆర్ బుకాయించడానికి ప్రయత్నం చేశారు. ఇప్పుడు బొగ్గు పూసుకుని, మారువేషం వేసుకుని తిరుగుతున్నడు ఆయన ముఖానికి" అని కేటీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దిగుమతి బొగ్గుపై విచారణ కావాలంటూ కేటీఆర్ లేఖ రాశారని.. ఆయన లేఖ మేరకు ఏ విచారణకైనా ఆదేశించడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. "ఏ విచారణ కావాలో కేటీఆర్ అడగాలి. ప్రజా కోర్టు ముందు బహిరంగ విచారణకైనా సిద్ధం" అని సవాల్ చేశారు. కాగా.. ఇటీవల ప్రారంభించిన ఆసుపత్రి సీఎం రేవంత్‌దేఅని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా.. "అన్నం తినేవాడు ఆరోపణలు చేస్తే ఆధారాలు చూపించాలి. నేను ప్రారంభించిన ఆసుపత్రిని కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా ప్రారంభించారు. ప్రారంభించినవన్నీ నావే అయితే ప్రపంచంలోనే శ్రీమంతుడిని అవుతాను" అని సమాధానమిచ్చారు. అవినీతిపై చర్చకు తాను ఎప్పుడైనా సిద్ధమని స్పష్టం చేశారు. 2015లో కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని, ఏపీకి 515టీఎంసీలు ఇవ్వాలని ఎవరు సంతకం పెట్టారని సీఎం ప్రశ్నించారు. "సంతకం పెట్టినవాడు మనిషేనా?తెలంగాణకు కృష్ణా జలాల్లో శాశ్వత మరణశాసనం రాసింది ఎవరు? కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను ధారాదత్తం చేసింది మీరు కాదా? చంద్రబాబు ముందు మోకరిల్లి సంతకం పెట్టింది మీరు. కృష్ణా నీటిని చంద్రబాబు, జగన్‌కు తాకట్టు పెట్టారు. రోజమ్మ రాగి సంకటి పెడితే రాయలసీమను రతనాలసీమ చేస్తానని చెప్పింది మీరు. పాలమూరుకు నీళ్లు ఇవ్వాలని ఒక్కరోజైనా మాట్లాడారా? ప్రాజెక్టులపై రూ.40వేల కోట్లు బకాయిలు పెట్టిపోయారు. కృష్ణాజలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కూడా అంత నష్టం జరగలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే జరిగింది. దీనిపై అసెంబ్లీలో చర్చ పెడితే రావడం లేదు. కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు సిద్ధమా?"అని నిలదీశారు.

# మహానగర పాలనకు కొత్త వ్యవస్థ

**విధాన నిర్ణయాలకు అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్..**

**పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ కమిటీ.. కౌన్సిల్ ఎక్స్అఫీషియో చైర్‌పర్సన్‌గా సీఎం**

**రెండు కీలక కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర ప్రాంత పాలనను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) చట్టం–2026 అమల్లో భాగంగా క్యూర్ పరిధిలో అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ పురపాలక శాఖ గురువారం రెండు (జీవో 251, 252) ఉత్తర్వులిచ్చింది. అక్టోబరు 2 నుంచి అమల్లోకి వచ్చిన ఈ చట్టం ద్వారా 1955 నాటి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) చట్టాన్ని రద్దు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ విధాన నిర్ణయాలకు కీలకం కానుంది. ముఖ్యమంత్రి ఈ కౌన్సిల్‌కు ఎక్స్అఫీషియో ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. పురపాలక శాఖ మంత్రి సభ్యుడిగా, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. చర్చించే అంశాలను బట్టి సంబంధిత శాఖల మంత్రులను ప్రత్యేక సభ్యులుగా, ఇతర శాఖల అధికారులను ప్రత్యేక ఆహ్వానితులుగా ఛైర్‌పర్సన్ ఆహ్వానించవచ్చని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కౌన్సిల్ తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేసింది. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి లేదా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ కమిటీ ఛైర్‌పర్సన్‌గా, హెచ్ఎండీ కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కమిటీలో క్యూర్ పరిధిలోని అన్ని కార్పొరేషన్ల కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు పోలీసు కమిషనర్లు, సంబంధిత జిల్లా కలెక్టర్లు, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ, వాటర్ బోర్డు ఎండీ, మెట్రో రైల్ ఎండీ, ఆర్టీసీ ఎండీ, హైడ్రా కమిషనర్ సభ్యులుగా కొనసాగుతారు.

# సింగరేణికి మరణశాసనం

**ప్రతి టన్నుపై రూ.1,500 చొప్పున కమీషన్: కేటీఆర్**

**'భోత్రా' చేసుకొన్న అగ్రిమెంట్లు బయటపెట్టాలి..**

**ఏ ప్రాతిపదికన ఎంపికచేశారో వెల్లడించాలి**

**విదేశీ బొగ్గు దిగుమతితో సింగరేణికి మరణశాసనం**

**కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరుపాలి**

**బొగ్గు స్కామ్ ఆపాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లేఖ**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో రూ.3 వేల కోట్ల దోపిడీకి కుట్ర జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు విమర్శించారు. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో సీఎం రేవంత్‌రెడ్డి ముందే చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. సింగరేణిలో బొగ్గు కొరత ఉన్నదంటూ కృత్రిమ సంక్షోభం సృష్టించి, అదును చూసి భోత్రా లాజిస్టిక్స్‌ను రంగంలోకి దించారని చెప్పారు. ప్రతి టన్నుపై రూ.1,500 చొప్పున కమీషన్ల రూపంలో భారీ దోపిడీకి రంగం సిద్ధమైందని ఆరోపించారు. ఆ కంపెనీ ఎంపిక వెనుక ఉన్న మతలబేందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. భోత్రా లాజిస్టిక్స్‌తో రాష్ట్రప్రభుత్వం, సింగరేణి చేసుకున్న అన్ని రహస్య అగ్రిమెంట్లను బయటపెట్టాలని కోరారు. సింగరేణిని బలహీనపరిచే కుట్రలను సహించబోమని, బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు కేటీఆర్ గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి ఐదు పేజీల బహిరంగ లేఖ రాశారు.

## టన్నుకు రూ.1,500 కమీషన్

రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగా బొగ్గు, విద్యుత్తు సంక్షోభాన్ని సృష్టించారని కేటీఆర్ ఆరోపించారు. దానిని కుంటిసాకుగా చూపి, విదేశీ బొగ్గు దిగుమతి పేరుతో సుమారు రూ.3 వేల కోట్ల భారీ కుంభకోణానికి తెరలేపడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. సింగరేణికి ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా, దేశంలో వనరులు అందుబాటులో ఉన్నా, దేశీయ సరఫరాను పెంచకుండా విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపడం వెనుక చీకటి ఒప్పందాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో భోత్రా లాజిస్టిక్స్ సంస్థ పాత్ర అనుమానాస్పదంగా ఉన్నదని పేర్కొన్నారు. ఆ సంస్థకు కాంట్రాక్టులు అప్పగించేందుకు అనుసరించిన ప్రమాణాలేంది? టెండర్ల ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగింది? ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలు, ఒప్పందాలు జరిగాయి? అనే వివరాలను ప్రభుత్వం బహిర్గతపర్చాలని డిమాండ్ చేశారు. బొగ్గు కొనుగోలు ధర, రవాణా వ్యయం, బీమా, ఇతర లాజిస్టిక్స్ ఖర్చులు, మధ్యవర్తుల పాత్రపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. భోత్రా సంస్థతో సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందాలు, చెల్లింపుల వివరాలనూ బహిర్గతం చేయాలని కోరారు. విదేశీ బొగ్గు దిగుమతుల పేరుతో టన్నుకు రూ.1,500 చొప్పున కమీషన్లు దండుకునే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు.

## ముందస్తు ప్రణాళికలో ప్రభుత్వం విఫలం

కరెంట్ కోతలపై ప్రజలు, రైతులు చేపడుతున్న ఆందోళనలను కూడా కాంగ్రెస్ సర్కార్ తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని కేటీఆర్ మండిపడ్డారు. వేసవిలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతుందని ముందే తెలిసినా బొగ్గు నిల్వలు, ఉత్పత్తి, రవాణా, సరఫరాపై ప్రభుత్వం సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించనే లేదని తెలిపారు. సంక్షోభం తీవ్రమయ్యాక అధికారులతో సమీక్షలు నిర్వహించి, వారిపై నెపం నెట్టడం ద్వా రా ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోలేదని స్పష్టంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం తో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి భారీగా పడిపోయిందని తెలిపారు. 2023–24లో 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదు కాగా, 2025–26లో సుమారు 58 మిలియ న్ టన్నులకు పడిపోయిందని తెలిపారు. ఈ తగ్గుదలకు కారణాలేంది? గనుల అభివృద్ధి, యంత్రాలు, పెట్టుబడులు, అనుమతుల విషయంలో ప్రభు త్వం తీసుకున్న చర్యలేంది? అని ప్రశ్నించారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించకుండా బొగ్గు కొరత ఉన్నదని చెప్పడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. సింగరేణి కార్మికులకు బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నప్పుడు, ఎందుకు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదు? దేశీయంగా బొగ్గు కొరతను ఎందుకు నివారించలేకపోయారు? ఇది కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం కాదా? అని నిలదీశారు.

## 'యాదాద్రి'కి బొగ్గు సరఫరాపై స్పష్టత ఇవ్వాలి

యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌కు బొగ్గు సరఫరాపై ప్రభుత్వం వాస్తవాలను వెల్లడించాలని కేటీఆర్ కోరారు. 2018 ఫిబ్రవరి 15న కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం సింగరేణి గనుల నుంచి ఏటా 14 మిలియన్ టన్నుల జీ–9 గ్రేడ్ బొగ్గు సరఫరాకు లింకేజీ కేటాయించారని పేర్కొన్నారు. 2022 ఏప్రిల్ 27న సరఫరా ఒప్పందం కూడా కుదిరిందని తెలిపారు. అలాంటప్పుడు ప్రస్తుత కొరతకు కారణాలేంటో? బొగ్గు నిల్వలు, నాణ్యత, రవాణా పరిస్థితులేంటో? ప్రభుత్వం వివరించాలని కోరారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో బొగ్గు, యాష్ హ్యాండ్లింగ్ వంటి పనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. తెలంగాణ జెన్‌కోకు అనుభవజ్ఞులైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు ఉన్నప్పుడు ప్రైవేట్ సంస్థలకు పనులు అప్పగించాల్సిన అవసరమేందని ప్రశ్నించారు. టెండర్ల విలువ, ఒప్పంద నిబంధనలు, నిర్వహణ ఖర్చులు, ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యంపై చేసిన అధ్యయనాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

## శ్వేతపత్రం విడుదల చేయాలి

విదేశీ బొగ్గు దిగుమతుల ప్రతిపాదనలు, కొనుగోలు పరిమాణం, ధరల అంచనాలు, టెండర్లు, సరఫరాదారుల ఎంపిక వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. భోత్రా లాజిస్టిక్స్ సంస్థతో జరిగిన చర్చలు, ప్రతిపాదనలు, ఒప్పందాలు, చెల్లింపులపై పూర్తి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. విదేశీ బొగ్గు దిగుమతుల వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించి, ఆర్థిక లావాదేవీలు, మధ్యవర్తుల పాత్ర, నిర్ణయాల వెనుక ఉన్న కారణాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. సంక్షోభాన్ని సాకుగా చూపి విదేశీ బొగ్గు దిగుమతుల వైపు మొగ్గుచూపడం, ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని నిర్లక్ష్యం చేయడం తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధమని కేటీఆర్ విమర్శించారు. సింగరేణిని బలహీనపరిచే చర్యలను బీఆర్ఎస్ సహించబోదని స్పష్టంచేశారు. రూ.3 వేల కోట్ల బొగ్గు సామ్, భోత్రా లాజిస్టిక్స్ పాత్ర, సింగరేణి ఉత్పత్తి తగ్గుదల, బకాయిలు, యాదాద్రికి బొగ్గు సరఫరా, దేశీయ వనరుల వినియోగంపై స్వతంత్ర విచారణ జరిపించి, సమగ్ర నివేదికలు బయటపెట్టాలని ఆయన స్పష్టంచేశారు. విద్యుత్తు, బొగ్గు సంక్షోభాల పేరుతో రూ.వేల కోట్లు దోచుకోవాలని చూస్తే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ వ్యవహారాన్ని అడ్డుకోవాల్సిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మకై సింగరేణి ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు.

# నీ ఉద్యోగం ఊడడం ఖాయం రేవంత్

**తప్పు మీరు చేసి.. అధికారులపై నెపమా?**

**సాగుకు 8 గంటలు కూడా విద్యుత్ ఇవ్వలేని కాంగ్రెస్ సర్కార్‌నే సస్పెండ్ చేయాలి**

**రైతు బీమాను నిలిపివేయడంతో 3 వేల..కుటుంబాలు రోడ్డునపడ్డాయి: హరీశ్‌రావు**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** "రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి మీ చేతగానితనమే కారణం. తప్పు మీరుచేసి.. విద్యుత్ అధికారులపై నెపం మోపుతారా..? సీఎం, మంత్రులు తప్పుచేసి.. అధికారులపై నెపం నెట్టడం పరిపాటిగా మారింది. రేవంత్‌రెడ్డీ... అధికారుల ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరిస్తున్నావ్.. కానీ ప్రజలు, ఉద్యోగులు నీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకో" అని గురువారం ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు హెచ్చరించారు. 9నెలలుగా ఎల్‌నినో ప్రభావం గురించి వాతావరణశాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారని, ఇంతకాలం మొద్దు నిద్రలో ఉండి.. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు.. ఇప్పుడు నిద్ర లేచి అధికారులను సస్పెండ్ చేస్తామని బెదిరించడం సరికాదన్నారు. నిషేధిత భూముల జాబితాలో తప్పు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కానీ అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఇప్పుడు కరెంట్ సంక్షోభం విషయంలోనూ తమ తప్పేం లేదని, అంతా అధికారులదే అన్నట్లు మాట్లాడుతూ మభ్యపెడుతున్నారన్నారు. బొగ్గునిల్వలు పెట్టుకోకుండా విద్యుత్ సంక్షోభానికి కారణమయ్యారని, విద్యుత్ రంగాన్ని గాలికి వదిలేసి, కరెంట్ కోతలకు కారణం అయ్యింది రాష్ట్ర ప్రభుత్వమ కాదా అని ఆయన ప్రశ్నించారు. మరోవైపు.. వ్యవసాయానికి 8 గంటలు కూడా విద్యుత్ అందించలేని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సస్పెండ్ చేయాలని, ఉద్యోగులను కాదని హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కారర్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గంలోని రైతు బీమా అందని 22 మంది రైతు కుటుంబాలతో హరీశ్‌రావు సమావేశమై, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తూ, కేసీఆర్ అమలు చేసిన రైతు సంక్షేమ పథకాలను నిలిపివేస్తున్నరని మండిపడ్డారు. దేశం మెచ్చిన రైతు బీమా పథకాన్ని నిలిపివేసి రైతు కుటుంబాల ఉసురు పోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఈరోజు వరకు సిద్దిపేట నియోజకవర్గంలో 22 మంది రైతులు చనిపోయారని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3వేల మంది రైతులు మరణించారని వివరించారు. రైతు బీమా నిలిపివేయడం వల్ల మృతిచెందిన మూడు వేలమంది రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అమలు కాని, సాధ్యపడని అడ్డగోలు హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి అన్నివర్గాలను మోసం చేశారని హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేటలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు.

# ఏసీబీ వలలో అయిదుగురు అవినీతిపరులు

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** కాదేది కవితకనర్హం అని ఓ కవి అన్నట్లు ఇక నుంచి కాదేది లంచానికనర్హం అని అనుకోవాలేమో. తమ విద్యుక్త ధర్మం ప్రకారం ప్రజలకు సర్వీసు అందించాల్సిన ప్రభుత్వోద్యోగులు, అధికారులు ప్రతిదానికీ లంచం డిమాండ్ చేస్తున్నారు. అలా లంచం తీసుకుంటూ గురువారం రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఓ తహసీల్దార్ సహా ఐదుగురు ప్రభుత్వ సిబ్బంది, ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఏసీబీ అధికారులకు చిక్కారు. హైదరాబాద్‌లోని మాదన్నపేట వాసి తన ఇంట్లో గల 6 పాత విద్యుత్ మీటర్ల స్థానే కొత్త మీటర్ల కోసం ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించాడు. అట్టుపై మాదన్నపేట సెక్షన్ సంతోషనగర్ సబ్ డివిజన్‌లోని ఎస్పీడీసీఎల్ ఏఈ పండాల సందయ్య రాకేశ్‌ను సదరు వినియోగదారుడు కోరారు. ఆన్‌లైన్‌లో డబ్బు కట్టగానే మీటర్లు రావని, ఒక్కో మీటర్‌కు రూ.20 వేలు తమకు ఇస్తేనే పని జరుగుతుందని ఏఈ తేల్చి చెప్పారు. దీంతో లంచం ఇవ్వడానికి ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ హైదరాబాద్ సిటీ రేంజ్–2 అధికారులు రంగంలోకి దిగి ట్రాప్ ఏర్పాటు చేశారు. బాధితుడి వద్ద నుంచి రూ.1.20లక్షల నగదు తీసుకుంటున్న ఏఈ రాకేశ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండల కేంద్ర గిరిధర్ రెడ్డి తల్లి సుశీల మరణం తర్వాత 184వ సర్వే నంబర్‌లోని అర ఎకరం భూమిని తన పేరు మీదకు మార్చాలని దరఖాస్తు చేసుకున్నాడు. కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా.. పని కాకపోవడంతో అధికారులను నిలదీయడంతో రూ.5 లక్షల లంచం ఇస్తేనే పని అవుతుందని డీటీ సందీప్ కుమార్ రెడ్డి తేల్చి చెప్పారు. దీంతో గిరిధర్ రెడ్డి.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు డబ్బు సిద్ధంగా ఉందని జీపీవో విజయ్‌కుమార్ రెడ్డికి సమాచారం ఇవ్వగా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బాలకృష్ణకు ఇవ్వాలని చెప్పాడు. బాలకృష్ణకు బాధితుడు రూ.2.50 లక్షల నగదు ఇవ్వగానే పట్టుకున్న ఏసీబీ అధికారులు.. అతడితోపాటు డిప్యూటీ తహసీల్దార్, జీపీవోలను అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే, రాజన్న–సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామ మహిళ ఒకరు తన భూమిని ఆమె సోదరుడికి గిఫ్ట్ డీడ్‌గా ఇవ్వడానికి గత నెలలో స్లాట్ బుక్ చేసుకున్నారు. కానీ, ఈ భూమి గిఫ్ట్ డీడ్ చేయడానికి రూ.10వేల లంచం అడిగిన తహసీల్దార్ అబూబాకర్.. చివరకు రూ.8,000కు ఒప్పుకుని కార్యాలయంలోని భూభారతి ఆపరేటర్ అనిల్‌కివ్వాలని సూచించారు. దీంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అనిల్‌కు డబ్బు ఇస్తుండగా పట్టుకున్న ఏసీబీ..అతడి వాంగ్మూలంతో తహసీల్దార్ అబూబాకర్‌ను అదుపులోకి తీసుకుంది.

# భూభారతికి ఆధార్ అనివార్యం

## మ్యుటేషన్, ఫౌతి మ్యుటేషన్,డేటా సవరణ తదితరాలకు.. సీసీఎల్ఏ ఉత్తర్వులు

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** భూభారతి పోర్టల్ ద్వారా అందించే పలు సేవలకు ఆధార్ అథెంటికేషన్(ధ్రువీకరణ) తప్పనిసరి చేస్తూ సీసీఎల్ఏ డీఎస్ లోకేశ్ కుమార్ ఉత్తర్వులిచ్చారు. భూ లావాదేవీలకు సంబంధించిన అన్ని రకాల రిజిస్ట్రేషన్లకు, భూముల మ్యుటేషన్‌కు, పట్టాదారు మరణించినప్పుడు వారసత్వ హక్కుల బదిలీ (ఫౌతి మ్యుటేషన్) కోసం, పట్టాదారు పాస్‌పుస్తకం దరఖాస్తులకు, పాస్ పుస్తకాల్లో డేటా సవరణకు, వ్యవసాయ భూములు, వ్యవసాయేతర అవసరాలకు మార్పిడి(నాలా) చేసేందుకు ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి చేశారు. ఈ సేవలకు సంబంధించి పౌరుల గుర్తింపు కోసం ఓటీపీ లేదా, ఈ కేవైసీకి సంబంధించిన బయోమెట్రిక్ ఐరిష్ ధ్రువీకరణ ద్వారా నిర్ధారించేందుకు రెవెన్యూశాఖ అనుమతించింది. భూభారతి పోర్టల్‌లో శాఖాపరమైన సేవలకు కూడా ఆధార్ ధ్రువీకరణను అనుమతించారు. సీసీఎల్ఏ ప్రధాన కార్యాలయం, జిల్లా కలెక్టరేట్లలో ఉద్యోగుల హాజరు నమోదు, భూభారతి పోర్టల్‌లో ఉద్యోగుల లాగిన్ అథెంటికేషన్, పట్టాదారుల ఖాతా వివరాల నవీకరణ వంటి సేవల్లో ఆధార్ తప్పనిసరి చేశారు. ఆధార్ అథెంటికేషన్ అమలు చేసే ముందు సంబంధిత వ్యక్తుల హక్కులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆధార్‌ఉన్న వ్యక్తి సమ్మతి తీసుకోవడంతోపాటు,అథెంటికేషన్ స్వచ్ఛందంగా ఉండాలని ఆదేశించారు.

# వ్యవస్థీకృత దోపిడీకి మార్గంగా 22 ఏ

**కాంగ్రెస్ అవినీతి సంపాదనకు ప్రధాన ఆదాయ వనరు అదే..**

**లక్షల మంది భూ యజమానులు, రైతులకు తీవ్ర వేధింపులు**

**బాధితులందరికీ న్యాయం చేయాల్సిందే: రాంచందర్‌రావు**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలున్నాయి: ఏలేటి**

**రేవంత్ ఉద్యోగం ఊడగొట్టేందుకు ప్రజలు సిద్ధం: రఘునందన్**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలో 22-ఏ (నిషేధిత జాబితా) పేరుతో వ్యవస్థీకృత భూదోపిడీ జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు దుయ్యబట్టారు. లక్షలాది మంది భూ యజమానులు, రైతులు తీవ్ర వేధింపులకు గురవుతున్నారన్నారు. పట్టా భూము లు, వ్యవసాయ క్షేత్రాలు, ప్లాట్లను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తూ, వాటి తొలగింపు పేరుతో భారీ అవినీతి దందాకు తెరలేపారని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో భూ కుంభకోణాలు జరిగాయంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. 22-ఏ నిషేధిత జాబితా అనేది కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి సంపాదనకు ప్రధాన వనరుగా మారిందని ఆరోపించారు. క్రమబద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగి.. 20-30 ఏళ్లుగా ప్రజల ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములు, ప్లాట్లను సైతం 22-ఏ జాబితాలో చేరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 22-ఏ నిషేధిత జాబితాలో భూముల చేర్పు, తొలగింపుల ప్రక్రియలో ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### అన్నీ కుంభకోణాలే: ఏలేటి

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య చీకటి ఒప్పందాలు కొనసాగుతున్నాయని ఏలేటి ధ్వజమెత్తారు. అందుకే.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూదందాలపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించడం లేదన్నారు. ధరణి నుంచి భూభారతి వరకు సాగిన భూకుంభకోణాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఫోరెన్సిక్ ఆడిట్‌లో భయంకర వాస్తవాలున్నట్లు ప్రకటించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి.. ఆ వివరాలను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. 'రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా, 42,53,532 ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉందని మంత్రి చెప్పారు. ఆ మిగిలిన 23,79,781 ఎకరాల అటవీ భూమి ఏమైంది..? హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కోటి 79 లక్షల ఎకరాల విలువైన భూదాన్ భూములుండగా, వాటిని 22ఏ జాబితాలో ఎందుకు ప్రదర్శించలేదో స్పష్టత ఇవ్వడం లేదు?' అని ప్రశ్నించారు. 'పూల గూడలోని సర్వే నం.285, 286, 287 పరిధిలోని భూమిని ఎవాక్యూ ప్రాపర్టీ అని పేర్కొంటూ 2025 నవంబరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించింది. కానీ, రెవెన్యూ మంత్రి కుటుంబానికి చెందిన 'నోవా బై రాఘవ' ఎంట్రీ ఇవ్వగానే తిరస్కరించిన భూమికే ల్యాండ్ కన్వర్షన్, హైరైజ్ బిల్డింగ్ అనుమతులన్నీ రాత్రికి రాత్రే వచ్చేయడం.. అధికార దుర్విని యోగం కాదా?' అని నిలదీశారు. 'కరెంటు ఇయ్యకపోతే ఉద్యోగాలు తీసేస్తామని కాంగ్రెస్ నాయకత్వం హైదరాబాద్‌లో కూర్చొని అధికారులను బెదిరిస్తోంది.. వాళ్ల ఉద్యోగాలు పోతా యో లేదో కానీ.. ఇంకో ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ నేతలతో పాటు రేవంత్‌రెడ్డి ఉద్యోగం ఊడగొట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధమయ్యారు' అని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రజలను అరిగోసలు పెడుతోందని ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం లోని ఎల్.బంజర్‌పల్లి, చందాపూర్, వరదరాజుపల్లి గ్రామాల్లో పలు అభివృ ద్ధి పనులకు, భూమి పూజతో పాటు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడు తూ.. ఏ పల్లెటూరుకు పోయినా కనీసం 12 గంటల కరెంటు వస్తలేదని, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు లేవు, పిం ఛన్లు పెంచలేదు, రోడ్లు బాగు చేయలేదు.. ఇదేనా మూడేళ్ల కాంగ్రెస్ పాలన అని నిలదీశారు.

# ట్రాఫిక్ రద్దీపై ఫిర్యాదు చేస్తారా?

## నూతన ఈ చలాన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన హైదరాబాద్ సీపీ సజ్జనార్

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాజధాని హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలు, రహదారి భద్రతపై ఫిర్యాదు చేయాలనుకుంటున్నారా? అందుకోసం హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ విభాగం కొత్తగా ఒక ఇంటరాక్టివ్ వెబ్‌సైట్ (https://echallan.tspolice. gov.in/htp/)ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కొత్త వెబ్‌సైట్‌ను ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తో కలిసి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రారంభించారు. ఇప్పటి వరకూ ఈ చలాన్ స్టేటస్, ట్రాఫిక్ సమాచారాన్ని మాత్రమే తనిఖీ చేసుకున్న వాహనదారులు.. ఇకపై నగరంలో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలు, రహదారి భద్రతపై అదే వెబ్‌సైట్‌లో అధికారులకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు. అందుకోసం ప్రత్యేకంగా సిటిజన్ కంప్లైంట్ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు లేటెస్టు అప్‌డేట్ తెలుసుకోవడానికి, అధికారులతో ఆన్‌లైన్ చాటింగ్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవడానికి వాట్సాప్ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. దాని ద్వారా నేరుగా ట్రాఫిక్ పోలీసులకు వాట్సప్‌లో మెసేజ్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చు. సిటిజన్ కంప్లైంట్ ఆప్షన్ విభాగాన్ని క్లిక్ చేసి, రహదారి భద్రత, ఇతర ట్రాఫిక్ సమస్యలపై ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేయడానికి ఒక ఫార్మెట్‌ను ట్రాఫిక్ పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. దాని ద్వారా వాహనదారులు ఎలాంటి ఫిర్యాదునైనా ఆన్‌లైన్‌లో చేయడానికి వీలు కల్పించారు. ట్రాఫిక్ సమస్యలకు ఏవైనా పరిష్కార మార్గాలు సూచించాలన్నా, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నా ఈ సైట్ ద్వారా ఇవ్వొచ్చు. ప్రజల నుంచి వచ్చే ఆచరించతగ్గ సూచనలను పోలీస్ ఉన్నతాధికారులు పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. అలాగే.. వాహనదారులు స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎక్కడుందో తెలుసుకోవాలన్నా, ఆ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాల లొకేషన్స్ కావాలన్నా అదే వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే వెంటనే వారి మెయిల్ ఐడీకి, ఫోన్ నంబర్‌కు పూర్తి వివరాలు వస్తాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పార్కింగ్ జోన్‌ల జాబితా, వాటి లొకేషన్లన కూడా కొత్త వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. హోమ్‌పేజీలో ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626తో పాటు.. ఇతర అత్యవసర నంబర్లన్నీ ఉంటాయి.

# సీజేఐ ధర్మాసనం సీరియస్

**సుప్రీంకోర్టుకు రాజకీయ ర్యాలీనా?**

**విపక్షాలపై సీజేఐ ధర్మాసనం ఆగ్రహం**

**రాహుల్ గాంధీ, ఖర్గే, అఖిలేష్‌తో పాటు పలువురికి నోటీసులు**



**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు ప్రాంగణంలోప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసన, పాదయాత్రపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. న్యాయవ్యవస్థను ఎవరూ భయపెట్టలేరని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం నిర్ణయాలను సవాలు చేస్తూ రాహుల్గాంధీ, ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్లపై నోటీసులు జారీ చేసినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ నాటికి వారి ప్రవర్తన ఎలా ఉంటుందో గమనిస్తామని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ నిరసనలు నిర్వహిం చడంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది గౌరవ్ భాటియా అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు రాజకీయ ఊరేగింపులతో తలమునకలవడం ఆమోదయోగ్యం కాదని, న్యాయస్థానం ప్రాంగణంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకూడదని గౌరవ్ భాటియా పేర్కొన్నారు. నిరసనలు, పాదయాత్రల ద్వారా న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావ డానికి ప్రయత్నిస్తున్నారని వాదించారు. ఈ సందర్భంగా న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. జయట వ్యక్తులు చేసే ప్రకటనలు, ఇతర ప్రయత్నాలను న్యాయస్థానం పట్టించు కోదని, జరుగుతున్న పరిణామాలన్నీ తమకు తెలుసునని వ్యాఖ్యానించారు. న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నాలు బలహీనమైనవని పేర్కొన్నారు.

### సీసీటీవీ దృశ్యాలు భద్రపరచండి..

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో అవకతవకలు జరిగాయంటూ సుప్రీంకోర్టు వరకు పాదయాత్ర నిర్వహించిన వ్యవహారంలో రాహుల్గాంధీ, అఖిలేశ్ యాదవ్, ఇతర నేతల కు సంబంధించిన మరో పిటిషన్పైనా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఇండియా కూటమి నిరసన సందర్భంగా సుప్రీం కోర్టు ప్రాంగణంలో నమోదైన సీసీటీవీ దృశ్యాలను భద్రపర చాలని ఆదేశించింది. సోమవారం రాహుల్గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నేతలు పాదయాత్ర చేపట్టారు. సెంట్రల్ ఢిల్లీలోని బారాఖంబా రోడ్డు నుంచి ప్రారంభమైన ఈ మార్చ్ సుప్రీంకోర్టు వద్ద ముగిసింది. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. ఈ ఘట నపై తాజాగా విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తన అభ్యం తరాలను వ్యక్తం చేసింది. అంతకుముందు, ఎస్ఐఆర్ ప్రక్రియ. ఎన్నికల సంఘం పనితీరుకు సంబంధించిన సమస్యలపై చర్చించడానికి అపాయింటిమెంట్ ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థ నను సీజేఐ సూర్యకాంత్ తిరస్కరించారు. లేవనెత్తాలనుకున్న సమస్యలు ఇప్పటికే సుప్రీంకోర్టులో పెండింగ్లో ఉన్నాయని పేర్కొంటూ సీజేఐ.. ఆయన అభ్యర్ధనను తిరస్కరించారు. ప్రభుత్వ పరిపాలనాపరమైన పనితీరులో కోర్టు జోక్యం చేసుకోలేదని, అయితే తగిన ఉపశమనం కోసం నాయకులు న్యాయపరమైన విషయాలలో కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమికి చెందిన ఇతర నేతలు దాఖలు చేసిన పిటిషన్ పై భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) సుప్రీంకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది.

# జంతర్ మంతర్ పై జవాబొచ్చాకే

**డీ నోటిఫై చేయడంపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు**

**ఎలాంటి పరిశీలనల ఆధారంగా నిర్ణయించారని ప్రశ్న?**

**జవాబులు రానివ్వండి.. సంతృప్తికరంగా లేకపోతే చట్టం తన పని తాను చేస్తుందని ధర్మాసనం వ్యాఖ్య**

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని నగరంలోని నిర్ణీత నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్ను తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఈ నిర్ణయం ప్రభుత్వమౌఖికపరిశీలనల ఆధారంగా తీసుకున్నారా? లేక నిరసన వేదికగా జంతర్ మంతర్ యోగ్యతను అంచనా వేసిన తర్వాత తీసుకున్నారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. జంతర్ మంతర్ డీనోటిఫై చేసేటప్పుడు ఢిల్లీ పోలీసులు ఆలోచించారా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తామ నిసుప్రీంకోర్టు తెలిపింది. అక్టోబర్ 11 నాటి స్టాండింగ్ ఆర్డర్ను సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటీషన్పై సుప్రీంకోర్టు గురువారం కేంద్రానికి నోటీసు జారీ చేసింది. ఈ ఆర్డర్ ద్వారా జంతర్ మంతర్ను నిర్దేశిత నిరసన స్థలం జాబితా నుండి తొలగించి, ఢిల్లీ పోలీసులు మూడు ప్రత్యామ్నాయ వేదికలను నోటిఫై చేశారు. ఆ స్థలం వినియోగం. సమర్థతకు సంబంధించి సంబంధిత అధికారులు ఆలోచించి నిర్ణయం తీసుకున్నారా లేదా అనే విషయాన్ని కోర్టు పరిశీలిస్తుం దని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమాయ బాగ్చీలతో కూడిన ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. నిరసనకారుల మాటలు స్పష్టంగా వినిపించే ప్రదేశమే నిరసన స్థలంగా ఉండాలని విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ముక్తా గుప్తా వాదించారు. ఆ స్థలం నోటిఫికేషన్ను ప నరుద్ధరించాలని.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు డీనోటిఫికేషన్ జరిగిందని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ నొక్కి చెప్పారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, డీనోటిఫికేషన్ను సుప్రీంకోర్టు మునుపటి నిర్ణయం ఆధారం కాదని అన్నారు.

ఒక కమిటీని ఏర్పాటు చేశారని, అది ఒక నివేదికను సమర్పించిం దని, ఈ నిర్ణయానికి గల కారణాలను కూడా నమోదు చేశారని, ఆ కమిటీ సిఫార్సు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ అంశాన్ని సాంకేతిక కోణంలో క డా అర్థం చేసుకోవాలని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు దగ్గరగా ఉన్నందున జంతర్ మంతర్ ను తరలించకూడదనే వాదనను ఆయన ప్రస్తావిస్తూ, దీనిపై స్పందన తెలియజే "యాలని కోర్టు ప్రభుత్వాన్ని కోరుతుందని చెప్పారు. న్యాయవాది స్వాతి సింగ్ ఈ పిటిషన్ను దాఖలు చేశారు. నిరసనలను సుదూర ప్రాంతాలకు తరలించడం వల్ల శాంతియుతంగా సమావేశమయ్యే ప్రాథమిక హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ నిష్ప్రయోజనం కావచ్చునని ఆమె వాదించారు. కేంద్రానికి, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ, వారి సమాధానాన్ని కోరుతున్నా మని.. వారు సమాధానమివ్వనివ్వండి.

ఒకవేళ ఆ సమాధానం. సంతృప్తికరంగా లేకపోతే అప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతుంది అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

# కేవలం సీఈసీ కోసం ప్రజలపైనే ప్రకోపమా

## మోడీ, అమిత్ షాపై సీజేపీ నేత దీప్కే విమర్శలు



**న్యూఢిల్లీ:** మోడీ, అమిత్ షా... తమ సొంత దేశ ప్రజలపైనే యుద్ధం చేస్తున్నారని సీజేపీ నేత అభిజిత్ దీప్కే విమర్శిం చారు. జ్ఞానేశ్ కుమార్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. సీఈసీని కాపాడేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని గురువారం విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. ఈ సమావేశంలో నేత నేహా బోరా, నటుడు ప్రకాశ్ రాజ్ కూడా పాల్గొన్నారు. సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలను న్యాయస్థానం తీహార్ జైలుకు తరలించిన మరుసటి రోజు ఈ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం పనితీరుపైనా విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్ విశ్వసనీయతను ప్రశ్నించారు. 2024 లోక్సభ ఎన్నికల్లో ఎన్డీయే, ఇండియా కూటమి మధ్య ఓట్ల తేడా దాదాపు రెండు శాతమేనని పేర్కొంటూ.. ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తున్నా రనే అనుమానాలు ఎందుకు రాకూడదని ప్రశ్నించారు.

# చికాగోలో హిందూ ఆలయంపై దాడి

## యువకుడు అరెస్ట్, ఆయుధాలు, తూటాలు స్వాధీనం

**చికాగో:** అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రం అరోరా ప్రాంతంలో హిందూ ప్రార్థనా మందిరాన్ని లక్ష్యం గా చేసుకుని దాడికి కుట్ర పన్నినట్లు ఆరోపణలు. ఎదుర్కొంటున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పాలటైన్కు చెందిన అలెగ్జాండ్రోస్ పాపరా కిస్ను సామూహిక కాల్పులకు కుట్ర పన్నినట్లు అనుమానిస్తూ అదుపులోకి తీసుకున్నట్లు అధికా రులు వెల్లడించారు. నిందితుడి వద్ద శ్వేతజాతి ఆధిపత్య భావజాలాన్ని ప్రతిబింబించే ప్రకటన లభించినట్లు సమాచారం. అందులో భారతీయ సంతతికి చెందిన ప్రజలపై హింసకు సంబంధిం చిన ప్రస్తావనలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నా రు. పాలటైన్ పోలీసులు నిందితుడి నివాసంలో సోదాలు చేపట్టి ఒక రైఫిల్, తూటాలు నింపిన మ్యాగజైన్లు, వంద లాది తూటాలను స్వాధీనం చేసుకున్నారు. బాడీ ఆర్మర్తో పాటు శ్వేతజాతి ఆధిపత్య తీవ్రవాదానికి సంబంధించిన చిత్రాలు ఉన్న ప్యాచ్ను అమర్చిన టాక్టికల్ వెస్ట్ను కూడా గుర్తించారు. దర్యాప్తునకు సంబంధించినవిగా భావిస్తున్న మరికొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

### ఘటనపై భారత్ ఆందోళన

నిందితుడి అరెస్టు, నిర్బంధం, అభియోగాలకు సంబంధించి అమెరికా అధికారులు తీసుకుంటున్న చర్యలను భారత్ గమనిస్తోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను న్యాయస్థానం ముందు నిలబెట్టాలని భారత్ ఆశిస్తోందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

# మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు

## మరోసారి స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

## మద్రాస్ హైకోర్టు తీర్పునకు సమర్థన

**న్యూఢిల్లీ,** మతం మారిన వారికి గత రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇస్లాంలోకి మతమార్పిడి చేసుకున్న హిందువులకు ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) రిజర్వేషన్ ప్రయోజనాలు నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ మేరకు హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్పై సుప్రీంకోర్టు గురువారం తన తీర్పును వెలువరించింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి హిందూయేతర సామాజిక వ్యవస్థకు మారిన వ్యక్తి ఆటువంటి ప్రయోజనాలను పొందలేరని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ చంద్రశేఖర్లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వును తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఏడు ముస్లిం వర్గాలను వెనుకబడిన తరగతులుగా గుర్తిం చాలన్న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ ప్రభుత్వ చర్య వల్ల హిందూ వెనుకబడిన తరగతులకు చెందిన వారు ఇస్లాంలోకి మారిన తర్వాత కూడా వెనుకబడిన తరగతి ముస్లింలుగా పరిగణించబడటానికి వీలు కలిగింది. సామాజికంగా, విద్యాస ఎరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తులు కేవలం ఇస్లాం మతంలోకి మారిన కారణంతోనే రిజర్వేషన్ ప్రయోజనాలను కోల్పోకుండా ఉండేలా చూడటమే 2024 మార్చి 9 నాటి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు ఉద్దేశమని తమిళ నాడు ప్రభుత్వం వాదించింది. కాన్స్టిట్యూషన్ (షెడ్యూల్డ్ క్యాస్ట్స్) ఆర్డర్, 1950 ప్రకారం, హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలను అనుసరించే వారికి మాత్రమే షెడ్యూల్డ్ కులం (ఎస్సీ) హోదా వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొన్నది.

### ఎస్ఎల్పీ దాఖలు చేయండి: స్టాలిన్

ఇస్లాం మతంలోకి మారిన వెనుకబడిన తరగతుల (వీసీ) సభ్యుల రిజర్వేషన్ హక్కులను పరిరక్షించేందుకు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్ఏ) దాఖలు చేయాలని డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తమిళనాడు ప్రభుత్వాన్ని కోరారు, సామాజిక వెనుకబాటుతనం ఒక్క రోజులోనో, ఒక్క తరంలోనో ఏర్పడదని, వేల సంవత్సరాలుగా నిర్మితమైన సామాజిక వ్యవస్థ ఫలితం అని.. మరో మతంలోకి మారడం దానిని చెరిపివేయదు అని స్టాలిన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# ఉపాధ్యాయుల సమస్యలపై మరో ఉద్యమానికి సిద్ధం

**ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి సంచలన ప్రకటన,**
**పీఆర్సీ, పెండింగ్ బిల్లులపై ప్రభుత్వ తాత్సారశీపై ఫైర్**
**వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సుంకరి భిక్షంగౌడ్ ప్రకటన**







**ప్రజా దీవెన, నల్లగొండ:** ఉపాధ్యా యులు, ఉద్యోగుల సమస్యల ప రిష్కారంలో ప్రభుత్వం ఇంకా తా త్సారం చేస్తే మరో ఉద్యమానికి సిద్ధమవుతామని పీఆర్టీయూ ఎ మ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి హెచ్చ రించారు. పెండింగ్ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాల ని, లేనిపక్షంలో భవిష్యత్తులో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నల్లగొండలోని జీఎం గార్డెన్‌లో గు రువారం పీఆర్టీయూ రాష్ట్ర అధ్య క్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి అ ధ్యక్షతన ప్రారంభమైన సంఘం ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుం చి సుమారు 6 వేల మంది ప్రతిని ధులు హాజరయ్యారు. ఉపాధ్యా యుల రాకతో నల్లగొండ పట్టణం పీఆర్టీయూ జెండాలతో సందడి గా మారింది.

### పీఆర్సీ అమలు చేయాలి, పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పింగిళి శ్రీపా ల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యా యుల పీఆర్సీ అమలు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, అధికారంలో కి రాకముందు ఇచ్చిన హామీ మే రకు సీపీఎస్ రద్దు, ఈహెచ్‌ఎస్ లో లోపాల సవరణ వంటి అంశా లపై శాసనమండలిలో పలుమా ర్లు గళమెత్తినట్లు తెలిపారు. గు రుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల ఉ పాధ్యాయులు ఎదు ర్కొంటున్న సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యల ను తీసుకెళ్లినా ఆశించిన స్పంద న రావడం లేదని అసంతృప్తి వ్య క్తం చేశారు. సెప్టెంబర్ 1న సు మారు 35 వేల మంది ఉపాధ్యా యులతో ఇందిరాపార్క్ వద్ద భా రీ ధర్నా నిర్వహించిన విషయా న్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్ర భుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకపోతే తదుపరి ఉ ద్యమ కార్యాచరణను ప్రకటిస్తా మని హెచ్చరించారు.

### పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సుంకరి భిక్షంగౌడ్

రానున్న వరంగల్–ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎ న్నికల్లో పీఆర్టీయూ అధికారిక అ భ్యర్థిగా రాష్ట్ర సంఘ ప్రధాన కా ర్యదర్శి సుంకరి భిక్షంగౌడ్‌ను స మావేశంలో ప్రకటించారు. ఉమ్మ డి నల్లగొండ జిల్లాలో సుమారు 1 5 ఏళ్లపాటు సంఘ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని నాయకులు పేర్కొన్నా రు.

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, విద్యావం తుల సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ఆయ న అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన ట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ తన అభ్యర్థిత్వానికి మద్దతు తె లిపిన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డితో పాటు రాష్ట్ర సంఘ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగు లు, ఉపాధ్యాయులు, విద్యార్థు లు, నిరుద్యోగులు, విద్యావంతు ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్ర భుత్వం చేసిన తప్పులనే ప్రస్తుత ప్రభుత్వం కూడా పునరావృతం చేస్తోందని విమర్శిస్తూ, ప్రజా స మస్యలపై తమ పోరాటం కొన సాగుతుందని స్పష్టం చేశారు.

### ఉపాధ్యాయుల హక్కుల సాధ నే పీఆర్టీయూ లక్ష్యం

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పు ల్గం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 72 వేల మంది సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయ సంఘంగా పీఆర్టీయూ నిలిచింద ని తెలిపారు. సంఘం ఆవిర్భా వం నుంచి ఉ పాధ్యాయుల సమ స్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందని, భవిష్యత్తులో నూ అదే స్ఫూర్తితో ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ స మావేశంలో మాజీ ఎమ్మెల్సీ మో హన్‌రెడ్డి, పీఆర్టీయూ అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి, క్ర మశిక్షణ సంఘం చైర్మన్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి, మాజీ రాష్ట్ర అ ధ్యక్షులు పేరి వెంకటరెడ్డి, గుండు లక్ష్మణ్, జగన్మోహన్ గుప్తా, నల్ల గొండ జిల్లా అధ్యక్షుడు కాళం నా రాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, అద్దంకి సునీ ల్, వీరమల్ల శ్రీనివాస్ గౌడ్, గుం డగోని రవిశంకర్ గౌడ్, రోలకలు నాగయ్య తదితరులు పాల్గొ న్నారు. 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు రా ష్ట్ర, జిల్లా,మండల స్థాయి నా యకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





## ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు




**ప్రజా దీవెన, కోదాడ:** భారత దేశ శాస్త్ర సాంకేతిక రంగాలకు విశిష్ట సేవలు అందించి దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేనీ కుసుమ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు లు అన్నారు. గురువారం కలాం జయంతి సందర్భంగా కోదాడ పట్టణం గాంధీ పార్క్ లో ఉన్న కలాం విగ్రహానికి స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తో కలిసి కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి తొలి మిస్సైల్ ను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎక్కడో పేద కుటుంబంలో జన్మించి ప్రపంచవ్యాప్తంగా అభిమానులును సంపాదించుకున్నారని అన్నారు. రాష్ట్రపతి గా ఎదిగిన గొప్ప శాస్త్రవేత్త భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప శాస్త్రజ్ఞుడు అని రాష్ట్రపతిగా అన్ని వర్గాల ప్రజల మన్ననలను అందుకుని ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న గొప్ప వ్యక్తి డాక్టర్ అబ్దుల్ కలామ్ అని ఆయన సేవలను స్మరించారు.ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ట్రస్టు సభ్యులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చీఫ్ అడ్వైజర్ పైడిమరి సత్తిబాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గరిణె ఉమా, శ్రీధర్, చారుగండ్ల రాజశేఖర్, కుక్కడుపు బాబు, యాదా సుధాకర్, వెంపటి వెంకటరమణ, గుడిగుట్ల సాయి, వెంపటి ప్రసాద్, చీటర్ల హనుమంత రావు,దేవరశెట్టి శంకర్,కొండ్లె రవి,స్వామి పుల్లయ్య, పత్తి నరేందర్,బొగ్గారపు రామ్మూర్తి, పైడిమర్రి సుధాకర్, చిత్తలూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు....

## రామాపురం క్రాస్ రోడ్డులో సాయిమందిరంలో విశేష పూజలు, అన్నదానం

### దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ

**ప్రజా దీవెన, కోదాడ:** కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్రోడ్డు వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మందిరం చైర్మన్ నల్లపాటి నరసింహారావు మాట్లాడుతూ, దాతల సహకారంతో మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉ ందన్నారు. అన్నదానం మహాదానమని, భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉ ండాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ దాతల సహకారంతో మరిన్ని ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు సాయి శర్మ, ముంద్రా రామారావు, ఆదినారాయణ, పూర్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహభరితంగా అలిగిన బతుకమ్మ వేడుకలు

### బతుకమ్మను భక్తిశ్రద్ధలతో మహిళలు పూజించాలి: కుసుమ



**ప్రజా దీవెన, కోదాడ:** పట్టణంలో ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటుచేసిన బతుకమ్మ ప్రాంగణంలో గురువారం అలిగిన బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు బతుకమ్మ ఆటపాటలను ప్రారంభించారు. మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నార అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు నిదర్శనమన్నారు. తొమ్మిది రోజులపాటు వివిధ పేర్లతో బతుకమ్మను పూజించడం మన సంస్కృతిలో ప్రత్యేకతను చాటుతుందన్నారు. ఆశ్వయుజ మాసంలో బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుకుంటారని, ఈ రోజును విశ్రాంతి దినంగా భావిస్తారని సంప్రదాయాలను భావితరాలకు అందించడంతోపాటు మహిళలంతా కలిసిమెలిసి పండుగను జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం మహిళలు రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలు, ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ వేడుకలతో పట్టణంలో పండుగ శోభ నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో తోట జ్యోతి శ్రీనివాస్ నూనె సులోచన ఎర్నేని నిర్మల,నెమ్మది దేవమణి, వార్డు కౌన్సిలర్లు వంగూరి గోపి, కొల్లా కోటిరెడ్డి,గంధం బాలేంద్రమ్మ పాండు జిల్లెపల్లి నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు బాయిజాన్,మాతంగి శైలజ పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు

## పిట్టలదొర వేషంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి సామాజిక చైతన్యం




నార్కెట్ పల్లి, అక్టోబర్ 15 : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలంటూ పిట్టలదొర వేషధారణలో వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు సూర్యాపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు. మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ ఈ ప్రచారం చేపట్టారు. గురువారం నార్కెట్ పల్లి పట్టణ కేంద్రం, బస్ స్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆయన పిట్టలదొర వేషంలో ప్రజలను అలరించారు. హాస్యంతో కూడిన మాటలు, ఆలోచింపజేసే సందేశాలతో యువత గంజాయి, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. సాధారణంగా యాచన కోసం వేసే పిట్టలదొర వేషానికి సామాజిక బాధ్యతను జోడించి, మరుగున పడుతున్న జానపద కళను కాపాడే ప్రయత్నం చేస్తున్నానని ప్రభాకర్ తెలిపారు.

## సాయిమందిరంలో విశేష పూజలు, అన్నదానం

### దేవాలయ అభివృద్ధిలోదాతలు భాగస్వామ్యం కావాలి: నరసింహారావు



**ప్రజా దీవెన, కోదాడ :** సాయిబాబా దేవాలయ అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని దేవాలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు పిలుపునిచ్చారు మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సాయిబాబా దేవాలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు మాట్లాడుతూ, దాతల సహకారంతో మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అన్నదానం మహాదానమని, భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు భవిష్యత్తులోనూ దాతల సహకారంతో మరిన్ని ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు సాయి శర్మ, ముంద్రా రామారావు, ఆదినారాయణ, పూర్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులకు రెడ్ కార్పెట్

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కీలక ప్రకటన,

పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండ గా ఉంటుంది

సింగిల్ విండో ద్వారా అనుమ తులు, భూమి, విద్యుత్, నీటి స దుపాయాలు కల్పిస్తాం

పెట్టుబడిదారులకు గార్డియన్ గా ఉంటా, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి లో భాగస్వాములు కావాలి

సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీ ట్--2026లో ఉప ముఖ్య మం త్రి భట్టి విక్రమార్క పిలుపు



**ప్రజా దీవెన, హైదరాబాద్:** తెలంగాణను పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రా ష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తల కు పూర్తి సహకారం అందిస్తుంద ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క స్పష్టం చేశారు. రాష్ట్రం లో పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వారికి సింగిల్ విండో విధానంలో అనుమతు లు, అవసరమైన భూమి, విద్యు త్, నీటి సదుపాయాలు కల్పిస్తా మని భరోసా ఇచ్చారు. పెట్టుబడి దారులకు తాను గార్డియన్‌గా ఉంటానని ప్రకటిస్తూ, తెలంగాణ ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని ప్రపంచవ్యాప్తంగా ఉ న్న పారిశ్రామికవేత్తలకు పిలుపు నిచ్చారు. హైదరాబాద్‌లోని హై టెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బి జినెస్ మీట్--2026లో భట్టి విక్ర మార్క మాట్లాడుతూ సంపద సృ ష్టించే పారిశ్రామికవేత్తలకు ప్రభు త్వం అండగా నిలుస్తుందని పే ర్కొన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకొస్తే వాటి పరి ష్కారానికి కృషి చేస్తామని తెలి పారు.

## పెట్టుబడులకు హైదరాబాద్ అనుకూల కేంద్రం

శాంతిభద్రతలు, మెరుగైన మౌ లిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అను కూలమైన వ్యాపార వాతావర ణం హైదరాబాద్‌కు ప్రధాన బలా లని ఉప ముఖ్యమంత్రి వివరిం చారు. భౌగోళికంగా అనుకూల మైన స్థానం, పారిశ్రామిక అవస రాలకు తగిన భూమి, విద్యాసం స్థల ద్వారా అందుబాటులోకి వ స్తున్న నైపుణ్యవంతులైన యు వత తెలంగాణకు పెట్టుబడుల ను ఆకర్షించే అంశాలని చెప్పా రు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యా పారవేత్తలు రాష్ట్రంలోని అవకా శాలను సద్వినియోగం చేసుకో వాలని, తమ వ్యాపారాలను వి స్తరించడంతోపాటు స్థానిక యు వతకు ఉపాధి అవకాశాలు క ల్పించాలని కోరారు.

## మూడు ప్రాంతాలుగా అభివృద్ధి ప్రణాళిక

హైదరాబాద్ పరిసర ప్రాంతాల ను కోర్ అర్బన్ రీజియన్ (కోర్), పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ (రే ర్)గా విభజించి అభివృద్ధి ప్రణా ళికలు రూపొందిస్తున్నట్లు భట్టి వి క్రమార్క వెల్లడించారు. కోర్ అర్బ న్ ప్రాంతంలో ఐటీ, సేవారంగం, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులుకి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పెరి అర్బన్ ప్రాంతం లో పరిశ్రమల అవసరాలకు అ నుగుణంగా ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతి పాదిత రీ జినల్ రింగ్ రోడ్డు మ ధ్య ప్రాంతాలను అనుసంధానిం చేలా రేడియల్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు వివరించా రు. ఇప్ప టికే 21 రేడియల్ రోడ్ల కు సంబంధించి మంజూరు, రూ పకల్పన ప్రక్రియ చేపట్టినట్లు పే ర్కొన్నారు. ఈ అనుసంధానంతో ఫార్మా, బ యోటెక్నాలజీ, విద్య, సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్ల స్టర్లను అభివృద్ధి చేసే అవకా శా లు మెరుగుపడతాయని చెప్పా రు. గ్రామీణ వ్యవసాయ ప్రాంతా ల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్ర మలను ప్రోత్సహించి స్థానిక వన రులకు విలువ జోడించడంతో పాటు గ్రామీణ యువతకు ఉపా ధి కల్పించేలా ప్రణాళికలు రూ పొందిస్తున్నట్లు తెలిపారు.

## సంపద సృష్టిలో పరిశ్రమలదే కీలక పాత్ర

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతా ని కి వ్యవసాయంతోపాటు పరిశ్రమ లు, సేవారంగాలు కీలకమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. తెలంగా ణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీ ఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం కాగా, సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని వివరించారు. ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐ టీ, పారిశ్రామిక మౌలిక సదుపా యాలు తదితర రంగాల్లోని వ్యా పారవేత్తలు రాష్ట్ర అభివృద్ధికి మ రింతగా దోహదపడాలని కోరా రు. పరిశ్రమలు విస్తరించడం ద్వారా పెట్టుబడులు, ఉపాధి, ప్ర భుత్వ ఆదాయం పెరిగే అవకా శాలు ఉన్నాయని పేర్కొన్నారు.

## పరిశ్రమల సమస్యల పరిష్కా రా నికి భరోసా

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధా లా సహకరిస్తుందని భట్టి విక్ర మార్క హామీ ఇచ్చారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స హా రాష్ట్ర మంత్రివర్గం పెట్టుబడి దారులకు అవసరమైన సహకా రం అందించేందుకు సిద్ధంగా ఉం దన్నారు. పరిశ్రమల స్థాపనకు అ వసరమైన అనుమతులు, భూ మి, విద్యుత్, నీటి సదుపాయా ల కల్పనలో ప్రభుత్వం తోడ్పడు తుందని స్పష్టం చేశారు. ఐటీ, ఏరోస్పేస్, రక్షణ, వ్యవసాయం, సినీ పరిశ్రమ సహా వివిధ రంగా ల్లో అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని వివరించారు.

## అభివృద్ధి ఫలాలు అందరికీ అం దాలి

సంపద కొద్దిమంది చేతుల్లోనే కేం ద్రీకృతం కాకుండా, అభివృద్ధి ఫ లాలు సమాజంలోని అన్ని వర్గా లకు అందాలని ఉప ముఖ్యమం త్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవే త్తలు తమ అనుభవాన్ని, పరిజ్ఞా నాన్ని కొత్తగా వ్యాపారాలు ప్రా రంభించేవారితో పంచుకోవాలని సూచించారు. ఒక వర్గం మాత్రమే అభివృద్ధి చెందడం సమగ్ర ప్రగతి కాదని, తమతోపాటు మరో పది మందిని ముందుకు తీసుకెళ్లిన ప్పుడే సమాజం నిజమైన అభి వృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నా రు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారి శ్రామికవేత్తలకు ప్రభుత్వం అం డగా నిలుస్తుందని పునరుద్ఘాటిం చారు. తెలంగాణలో పరిశ్రమలు స్థాపిం చండి.. రాష్ట్ర ఆర్థికాభివృ ద్ధిలో భాగస్వాములు కండి.. యువత కు ఉపాధి కల్పించి స మగ్ర ప్రగతి కి బాటలు వేయండి అని భట్టి విక్రమార్క పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు.

# పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు పార్టీలు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజా దీవెన, నల్లగొండ :** వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, సర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంకా 2,195 మంది ఓటర్లకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన పెండింగ్‌లో ఉందని, వాటిని ఇంటింటికీ వెళ్లి పరిశీలించి శుక్రవారం నాటికి పూర్తి చేయాలని తహసీల్దార్లు, బీఎల్‌ఓలను ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా నుండి తొలగించబడిన వారు తిరిగి ఓటు హక్కు పొందేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ శిబిరాల సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉ ంటారని, అలాగే బూత్ లెవల్ ఏజెంట్లు సైతం శిబిరాలలో పాల్గొని సహకరించాలని కోరారు. ఓటర్ల తొలగింపు విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు,



నోటీసులు, బీఎల్‌ఏ నివేదిక తదితర ప్రక్రియలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కోరారు . పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, కాంగ్రెస్ పార్టీ తరపున ముంతాజ్ ఆలీ, టిఆర్ఎస్ నుండి బక్క పిచ్చయ్య, ఆమ్ ఆ ద్మీ పార్టీ నుండి అన్సారి, బిజెపి తరపున లింగస్వామి, సిపిఎం నుండి నర్సిరెడ్డి, టిడిపి నుండి తేలు అన్న రవి, అద్దంకి రవీందర్ తదితరులు హాజరయ్యారు.

# అమ్మ హాస్పిటల్‌లో అత్యాధునిక రోబోటిక్

## సూర్యాపేటలో కీళ్ల మార్పిడి సాంకేతికత ప్రారంభం

**ప్రజా దీవెన, సూర్యాపేట టౌన్** ఉమ్మడి నల్గొండ జిల్లా వైద్య చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సూర్యాపేటలోని మన అమ్మ హాస్పిటల్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొట్ట మొదటిసారిగా అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతతో కీళ్ల మా ర్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు మన అమ్మ హాస్పిటల్ ని ర్వాహకులు డాక్టర్ సుధీర్ కు మార్, డాక్టర్ స్వరూప లక్ష్మి ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ సాంకేతికను, విజయకృష్ణ నర్సింగ్ హోమ్ హాస్పిటల్ వైద్యులు

డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ విజయలక్ష్మి గురువారం ప్రారంభించి మాట్లాడారు. మన అమ్మ హాస్పిటల్ నిర్వాహకులు మాట్లాడుతూ ఆధునిక వైద్య సాంకేతికతను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోబోటిక్ సాంకేతికత ద్వారా కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో మరింత ఖచ్చితత్వాన్ని సాధించేందుకు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.




ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రంగారెడ్డి, డాక్టర్ రమేష్ ప్రెసిడెంట్, డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ చంద్రశేఖర్, బంధు వీరయ్య, బంధు శ్రీధర్, తొగరు మల్లికార్జున్, ఇజ్రాయిల్, వివిధ సంఘాల సభ్యులు, కుటుంబ సభ్యులు, మన అమ్మ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.20 లక్షల లంచంతో ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ ఏఈ

## రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ వైనం



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీ తికి పాల్పడే అధికారులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తోంది. ఈ క్రమం లో హైదరాబాద్‌లోని సంతోష్‌న గర్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న మదన్నపేట సెక్షన్‌కు చెందిన TG SPDCL అసిస్టెంట్ ఇంజినీర్ పండల సంధ్య రాకేష్ రూ. 1.20 లక్ష ల లంచం తీసుకుంటూ ఏసీబీ అ ధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా ప ట్టుబడ్డారు. ఏసీబీ సిటీ రేంజ్-II అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారునికి పాత విద్యుత్ మీటర్లు పోయిన స్థానంలో ఆరు కొత్త విద్యుత్ మీటర్లు మంజూరు చేయడంతో పాటు, వాటికి సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులను ఆమోదించేందు కు నిందిత అధికారి రూ. 1,20,0 00 లంచం డిమాండ్ చేశారు. ఈ మొత్తాన్ని స్వీకరిస్తుండగా అక్టో బర్ 15న ఏసీబీ అధికారులు దా డి చేసి పట్టుకున్నారు. లంచంగా తీసుకున్న నగదును కూడా స్వా ధీనం చేసుకున్నారు.

## అవినీతి నిరోధక చట్టం కింద చర్యలు

తన అధికారిక విధులను అక్ర మంగా, నిజాయితీకి విరుద్ధంగా నిర్వహించి అక్రమ లబ్ధి పొందేం దుకు ప్రయత్నించినట్లు ఏసీబీ అ ధికారులు పేర్కొన్నారు. నిందిత అధికారిని నాంపల్లిలోని ఎస్పీఈ & ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయ స్థా నం ముందు హాజరుపరిచి జ్యు డీషియల్ రిమాండ్‌కు తరలించే ప్రక్రియ చేపట్టారు. ఈ కేసులో త దుపరి విచారణ కొనసాగుతోంది. ఫిర్యాదుదారుని భద్రత దృష్ట్యా ఆయన వివరాలను ఏసీబీ అధి కారులు గోప్యంగా ఉంచారు.

## లంచం అడిగితే 1064కు ఫోన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ని ర్భయంగా తెలంగాణ ఏసీబీకి ఫి ర్యాదు చేయవచ్చని అధికారు లు సూచించారు. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ 944 0446106, ఫేస్‌బుక్‌లో Telan gana ACB, ఎక్స్ (ట్విట్టర్) @ Telangana ACB లలో తో పా టు ప్రభుత్వ కార్యాలయాలు, ప్ర ధాన బహిరంగ ప్రదేశాల్లో అందు బాటులో ఉన్న ఏసీబీ క్యూఆర్ కోడ్ ద్వారా కూడా ఫిర్యాదు చే యవచ్చు. ఫిర్యాదుదారుల పేర్లు, వ్యక్తిగత వివరాలను గో ప్యంగా ఉంచుతామని ఏసీబీ స్ప ష్టం చేసింది. అవినీతిని సహించ కుండా, లంచం డిమాండ్ చేసే అ ధికారులపై ఫిర్యాదు చేసి పార దర్శక పాలనకు ప్రజలు సహక రించాలని అధికారులు కోరుతు న్నారు.

# రూ.8 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

## ప్రైవేట్ వ్యక్తి కూడా అ రెస్ట్





**ప్రజా దీవెన, రాజన్న సిరిసిల్ల:** ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీ తికి పాల్పడే వారిపై ఏసీబీ అధి కారులు చర్యలు కొనసాగిస్తున్నా రు. ఈ క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ తహ సీల్దార్ కార్యాలయంలో రూ. 8,0 00 లంచం తీసుకుంటున్న తహ సీల్దార్ కమ్ జాయింట్ సబ్ రిజి స్ట్రార్ ఎండీ అబూబకర్‌తో పా టు, ఆయనకు సహకరించిన ప్రై వేట్ వ్యక్తి సంకసాల అనిల్ కు మార్ ఏసీబీ అధికారులకు పట్టు బడ్డారు.

## గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం లంచం

ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకా రం.. ఫిర్యాదుదారుని అత్తకు చెందిన వ్యవసాయ భూమిని ఆయన తండ్రి పేరుపై గిఫ్ట్ డీడ్ (బహుమతి పత్రం) ద్వారా రిజి స్ట్రేషన్ చేయించేందుకు సహ కరించే నిమిత్తం రూ. 8,000 లం చం డిమాండ్ చేసినట్లు ఆరో ప ణలు ఉన్నాయి. ఈ వ్యవహారం లో వేములవాడ రూరల్ తహసీ ల్దార్ కమ్ జాయింట్ సబ్ రిజి స్ట్రార్ ఎండీ అబూబకర్ (A-1), కార్యాలయ పరిధిలో భూ భార తి ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రై వేట్ వ్యక్తి సంకసాల అనిల్ కుమార్ (A-2) పాత్ర ఉన్నట్లు ఏసీ బీ పేర్కొంది. లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న స మయంలో కరీంనగర్ పరిధి ఏసీ బీ అధికారులు దాడి చేసి ఇద్ద రినీ పట్టుకున్నారు. అనిల్ కుమా ర్ వద్ద నుంచి రూ. 8,000 నగదు ను స్వాధీనం చేసుకున్నారు. అ ధికారిక విధులను దుర్వినియో గం చేసి అక్రమ లబ్ధి పొందినట్లు తహసీల్దార్‌పై ఆరోపణలు నమో దయ్యాయి.

## ప్రత్యేక కోర్టుకు హాజరు

పట్టుబడిన ఇద్దరినీ కరీంనగర్ లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్ర త్యేక న్యాయస్థానంలో జ్యుడీషి యల్ రిమాండ్ నిమిత్తం హాజరు పరచనున్నట్లు అధికారులు తెలి పారు. ఈ కేసులో తదుపరి ద ర్యాప్తు కొనసాగుతోందని వెల్లడిం చారు. ఫిర్యాదుదారుని భద్రత దృష్ట్యా ఆయన పేరు, ఇతర వివ రాలను గోప్యంగా ఉంచినట్లు స్ప ష్టం చేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



**శాలిగౌరారం :** శాలిగౌరారం మండలంలో యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయని, ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని శాలిగౌరారం మండల సిపిఎం కార్యదర్శి చలకాని మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం చలకాని మల్లయ్య విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలోని అన్ని క్లస్టర్లలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, మద్దతు ధర కల్పించి సకాలంలో చెల్లింపులు జరపాలని కోరారు.

# చేనేత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పథకాన్ని పునరుద్ధరించాలి

## మంత్రి తుమ్మలకు పద్మశాలి సంఘాల నేతల వినతి



**ప్రజా దీవెన, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని 59 సంవత్సరాలు పైబడిన చేనేత కార్మికులకు ప్రభుత్వం గతంలో అందజేసిన ఎక్స్‌గ్రేషియా పథకానికి సంబంధించిన జీవోను పునరుద్ధరించి, పథకాన్ని తిరిగి అమలు చేయాలని కోరుతూ పద్మశాలి సంఘాల నాయకులు రాష్ట్ర వ్యవసాయ, చేనేత మరియు జౌళి శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చేనేత వృత్తినే జీవనాధారంగా చేసుకొని జీవితాంతం శ్రమించిన కార్మికులు వృద్ధాప్యంలో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా 59 సంవత్సరాలు పైబడిన కార్మికులు వయోభారం, అనారోగ్య సమస్యలు, ఉపాధి అవకాశాల కొరత కారణంగా కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న ఎక్స్‌గ్రేషియా పథకం అనేక చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించిన జీవోను పునరుద్ధరించి, అర్హులైన చేనేత కార్మికులకు తిరిగి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

### టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర చేనేత రంగానికి కీలకమైన టెస్కో (తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ)కు ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్యబద్ధంగా పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని నాయకులు మంత్రిని కోరారు. ఎన్నికలు నిర్వహించే వరకు సంస్థ కార్యకలాపాలు సమర్థవంతంగా సాగేందుకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు.

చేనేత సహకార రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, సహకార సంఘాల సమస్యల పరిష్కారం కోసం టెస్కోలో సమర్థవంతమైన పరిపాలన అవసరమని వారు పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చేనేత కార్మికుల సంక్షేమంతో పాటు సహకార రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఎక్స్‌గ్రేషియా పథకం పునరుద్ధరణ, టెస్కోకు ఎన్నికలు, పర్సన్ ఇన్‌చార్జి కమిటీ నియామకం వంటి అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్థపు మురళి, అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజా దీవెన, యాదగిరిగుట్ట :** రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. తుర్కపల్లి మండలం గందమల్ల గ్రామంలో గురువారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. వీధులన్నీ తిరిగి ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఇంటింటికీ తిరిగి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం మదర్ డెయిరీ పాడిరైతులకు బోనస్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గతంలో మంజూరైన 40 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. గందమల్ల రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్రాధాన్యమిచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో హెచ్‌ఎండీఏ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నిధులతో సుమారు రూ. 4 కోట్లు వెచ్చించి సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టామని, ఎస్సీ కాలనీకి అధిక ప్రాధాన్యతనిస్తూ త్వరలోనే రూ.80 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత ప్రజల 60 ఏళ్ల కల అయిన గంధమల్ల ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్న ఆయన.. రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే 16 మండలాల్లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇక వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు.

# తెలంగాణ సంప్రదాయంలో బతుకమ్మది ముఖ్యపాత్ర

## నల్లగొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్ర శేఖర్

**ప్రజా దీవెన, నల్లగొండ:** తెలంగాణ ప్రజలకు బతుకునిచ్చిన బతుకమ్మ తెలంగాణ సంప్రదా యంలో ముఖ్యపాత్ర పోషిస్తుం దని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అన్నారు. బతుకమ్మ సంబురా లలో భాగంగా గురువారం నల్గొం డ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళా శాల మైదానంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బతుకమ్మ ఆడిన అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ప్రతిరోజు కొన్ని శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామని, గురువారం వ్యవసాయ ,ఉద్యాన ,పశు సంవర్ధక, వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మనకు బతుకునిచ్చిన బతుకమ్మ ఉత్సవాలు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రత్యేకించి తంగేడు పూలతో చేసిన బతు కమ్మ మనకు ఎన్నో విలువలను నేర్పిస్తుందని అన్నారు. దసరా, నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మ వారి కరుణా కటాక్షాలు జిల్లా ప్రజలందరిపై ఉండాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే శక్తిని ఆ భగవంతుడు జిల్లా ప్రజలందరికీ ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలందరికీ ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలియ జేశారు. వివిధ శాఖల జిల్లా అధి కారులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.



### జిల్లాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ వేడుకలను నల్గొండ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బతుకమ్మ వేడుకలలో భాగంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో అక్టోబర్ 13 నుండి అక్టోబర్ 18 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 13:మహిళా శిశు సంక్షేమ శాఖ , మార్కెటింగ్, పరిశ్రమల శాఖ, మెప్మా శాఖలు బతుకమ్మ వేడుకలు నిర్వహించాయని,

అక్టోబర్ 14 న మునిసిపల్, ట్రాన్స్‌కో, మత్స్య శాఖ, బి సి, ఎస్ సి, ఎస్ టి, మైనారిటీ సంక్షేమ శాఖలు,సహకార, పౌర సరఫరాల శాఖ, టి యన్ జీ ఓ , సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు . అక్టోబర్ 15 న వ్యవసాయ , సెరికల్చర్, ఉద్యాన, చేనేత ,జౌళి , పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నామని,

అక్టోబర్ 16న వైద్య ఆరోగ్య జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి, యువజన సంక్షేమ శాఖ, మెప్మా, కార్మిక శాఖ, బార్ అసోసియేషన్, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ మరియు ఇతర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో, బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అక్టోబర్ 17 న డి ఆర్ డి ఏ, జిల్లా పంచాయతీ ,ప్రణాళిక శాఖ , ఆర్టీసీ,మెప్మా, దేవాదాయ శాఖ,రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అలాగే చివరి రోజై న అక్టోబర్ 18 న సద్దుల బతుకమ్మ ను అటవీ శాఖ, పోలీస్, ఎక్సైజ్, ఫైర్, రవాణా మెప్మా, విద్యా శాఖ మరియు అన్ని ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ వేడుకలలో సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది తప్పనిసరిగా హాజరై ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వేడుకల సందర్భంగా ఎన్జీ కళాశాల ఆవరణలో

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని కార్యక్రమాల పర్య వేక్షణ బాధ్యతలను నల్గొండ రెవెన్యూ డివిజనల్ అధికారి, నల్గొండ తహసీల్దార్‌లకు అప్ప గించామని, వేదిక అలంకరణ, లైటింగ్, మైక్ సిస్టమ్, పారిశు ధ్యం మరియు తాగునీటి సదు పాయాలను మునిసిపల్ కమిషనర్ పర్యవే క్షి స్తున్నారని ,ప్రతిరోజూ 3 నుండి 4 స్వయం సహాయక సంఘాల మహిళలను బతుకమ్మ పండుగ లో భాగస్వామ్యం అవుతున్నా రని తెలిపారు.

# ఎంఈఎఫ్ నల్లగొండ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక




**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** నల్లగొండ పట్టణంలో ఎంఈఎఫ్ (MEF) నల్లగొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఎన్నికల ఇన్చార్జి, రాష్ట్ర ఉపాధ్య క్షుడు మామిడి సైదులు అధ్యక్షతన నిర్వహిం చిన ఎన్నికల కార్యక్రమానికి ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చేబర్తి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద దేవేందర్ ప్రసాద్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా వడ్డే రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పులికంటి భాస్కర్, చింత యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా చింత ఎల్లయ్య, కోశాధికారిగా తాటిపాముల సైదులు, అదనపు ప్రధాన కార్యదర్శిగా జీడిమడ్ల రమేష్ ఎన్నికయ్యారు.

### నూతన కార్యవర్గం వివరాలు

ఉపాధ్యక్షులుగా గుండ్లపల్లి నాగరాజు, మతి కోటేశ్వరి, బొంగరాల సాగరయ్య, దైద వీరు; జాయింట్ సెక్రటరీలుగా మైనం ఉషయ్య, జ్యోతి; ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మామిడి లింగస్వామి, శేఖర్, ఇంజమూరి సైదులు, చిటిపాక శ్రీను ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు.

### జాతీయ స్థాయిలోనూ నియామకాలు

ఎంఈఎఫ్ జాతీయ స్థాయిలో పలువురికి కొత్త బాధ్యతలు అప్పగించడంతో పాటు మరి కొందరికి పదోన్నతులు కల్పించారు. వస్కుల సత్యనారాయణను జాతీయ ఉపాధ్యక్షుడిగా, లంకపల్లి నగేష్ను జాతీయ జాయింట్ సెక్రట రీగా, బొజ్జ వేణుగోపాల్ను జాతీయ ఆర్గనై జింగ్ సెక్రటరీగా, గట్టు మల్లయ్య, ఎర్ర వెంకటనారాయణలను జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు మల్లేపాక వెంకన్న, జాన్ విల్సన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎన్నికల ఇన్చార్జి వల్లంపట్ల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవర పాలెం ప్రభాకర్, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆడెపు జానయ్య, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రేగూరి రాము, పలువురు మాజీ రాష్ట్ర, జిల్లా నాయకులు, జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

# జూనియర్ సివిల్ జడ్జిగా సాయి పవన్



**ప్రజా దీవెన, హనుమకొండ:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన డ్యాగల సారయ్య సత్యవతి కుమారుడైన డ్యాగల సాయి పవన్ జూనియర్ సివిల్ జడ్జి సాధించి తల్లి తండ్రులతో పాటు చదువు చెప్పిన గురువులకు పేరు తెచ్చి పెట్టారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత న్యాయ వ్యవస్థపై మక్కువతో సమాజంలోని చెడును చట్టపరంగా తుడిచి వేయడంతో పాటు సామాన్యునికి న్యాయం అందేలా, నేరాలను అదుపు చేయడం కోసం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఐ ఐ టి కరగ్ పూర్ లో ఎల్ ఎల్ బి హానర్స్ పూర్తి చేసిన సాయి పవన్ కొంత కాలం డిల్లీ హై కోర్టు, తీస్ హజారి జిల్లా కోర్టు, హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూనే జూనియర్ సివిల్ జడ్జి సాధించాలని పట్టుదలతో మూడు సార్లు పరీక్షలు వ్రాసి జూనియర్ సివిల్ జడ్జి పదవి సాధించాడు. నాలుగు రోజుల క్రితం తెలంగాణ పోలీసు శాఖ విడుదల చేసిన ఎ.పి.పి ఫలితాల్లో కూడా పదవిని సాధించాడు. సాయి పవన్ తండ్రి విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడుతో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సాయి పవన్ నియామకం పట్ల తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు ముద్దసాని సహోదర రెడ్డి, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర కమిటి సభ్యులు జన్ను పద్మ, ఎగ్గడి సుందర్ రామ్, సహచర న్యాయవాదులు నారాయణరావు, ఇ. సత్యనారాయణ రెడ్డి, బండి మొగిలి ఎం. శ్రీనాథ్, చింత నిఖిల్, జన్ను ప్రభాకర్, సన్నీ కుమార్, రాహుల్, లోకేశ్వర్ తదితరులు అభినందనలు తెలిపారు.

# మహిళలు, చిన్నారుల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం

## యాదగిరిగుట్ట సీఐ భాస్కర్

**ప్రజా దీవెన, యాదగిరిగుట్ట :** సమాజంలో మహిళలు, చిన్నారుల రక్షణే తమ ప్రథమ కర్తవ్యం అని, వారి భద్రత కోసం పోలీసులు నిరంతరం అండగా ఉంటారని యాదగిరిగుట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలం మైలార్‌గూడెం గ్రామంలో మహిళలు, చిన్నారుల భద్రతపై గ్రామస్తులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ... నేటి సమాజంలో మహిళలు, పిల్లలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణాలు చేసే సమయంలో గమ్యస్థాన వివరాలను కుటుంబ సభ్యులకు, అత్యంత నమ్మకమైన వ్యక్తులకు తెలియజేయాలని, రాత్రి సమయాల్లో నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా తిరగడాన్ని నివారించాలని సూచించారు. ప్రతి మహిళా ఆత్మరక్షణ పద్ధతులను నేర్చుకోవడం ద్వారా అనుకోని ఆపదల నుంచి రక్షించుకోవచ్చన్న ఆయన.. అత్యవసర సహాయం కోసం డయల్ 100తో పాటు స్థానిక పోలీసు స్టేషన్ నంబర్లను ఫోన్‌లో అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం, ఫోటోలు అపరిచితులతో పంచుకోవద్దని.. వేధింపులు, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

### చిన్నారుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ

తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచే 'మంచి స్పర్శ(గుడ్ టచ్)', 'చెడు స్పర్శ(బ్యాడ్ టచ్)' లపై అవగాహన కల్పించాలని సీఐ భాస్కర్ పేర్కొన్నారు. పిల్లలకు ఎలాంటి అసౌకర్యం, భయం కలిగినా వెంటనే తల్లిదండ్రులతో పంచుకునేలా స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, అపరిచితుల వెంట వెళ్లరాదని, వారిచ్చే తినుబండారాలు, బహుమతులు స్వీకరించవద్దని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలని తెలిపారు.

# హత్య కేసులో జీవిత ఖైదు.. జరిమానా

**ప్రజా దీవెన, యాదగిరిగుట్ట :** హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించడంతో పాటు జరిమానా విధిస్తూ గురువారం యాదాద్రి జిల్లా ఒకటవ అదనపు కోర్టు తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే.. రాజాపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన వడ్లకొండ నాగరాజు మద్యానికి బానిసగా మారాడు. డబ్బుల కోసం దారివెంట వెళ్తున్న వారిని వేధించేవాడు. దీంతో అతడికి కనబడకుండా వెళ్లేవారు. ఈ క్రమంలో 16 నవంబర్ 2024న అదే గ్రామానికి చెందిన మజ్జిగ యాదగిరి (57) తన వ్యవసాయ బావి వద్ద నుంచి ఇంటికి వెళ్తుండగా నాగరాజు తారసపడ్డాడు. నాగరాజు డబ్బు అడగడంతో ఇద్దరి మధ్య వాగ్వాదంతో పాటు గొడవ జరిగింది. ఆవేశానికి లోనై యాదగిరిపై నాగరాజు దాడి చేసి విచక్షణారహితంగా కొట్టి చంపాడు. కేసు నమోదు చేసిన రాజాపేట పోలీసులు నాగరాజును రిమాండ్ తరలించారు. సాక్షాలు సమర్పించడంతో యాదగిరిని నాగరాజు హత్య చేశాడని నిర్ధారణ అయింది. దీంతో నాగరాజుకు జీవిత ఖైదు విధించడంతో పాటు రూ. 10 వేలు జరిమానా విధిస్తూ ఒకటవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. రాజాపేట పోలీసులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను ఎస్పీ అక్షాంశ్ యాదవ్ అభినందించారు.

# ఇలా అయితే వరల్డ్ కప్ ఎప్పటికీ గెలవలేరు

## టీమిండియాపై మాజీ స్టార్ క్రికెటర్ విసుర్లు

వెస్టిండీస్‌తో నాలుగో టీ20లో ఓటమి తర్వాత భారత జట్టు బౌలింగ్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర విమర్శలు చేశాడు. బౌలర్లు ఇదే తీరులో విఫలమైతే ప్రపంచకప్ గెలవడం అసాధ్యమని హెచ్చరించాడు. కేవలం ఒక్క మ్యాచ్‌లో ఓటమిని చూసి ఈ వ్యాఖ్యలు చేయడం లేదని, సిరీస్ మొత్తం బౌలింగ్‌లో కనిపిస్తున్న లోపాలే తన ఆందోళనకు కారణమని స్పష్టం చేశాడు. బుధవారం జరిగిన నాలుగో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత్ పోరాడినా 24 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌పై క్రిక్‌బజ్‌తో మాట్లాడిన కైఫ్.. భారత బౌలర్ల వైఫల్యమే ఓటమికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డాడు. 247 పరుగులు భారీ స్కోరని, ప్రత్యర్థిని అంతటి స్కోరుకు అనుమతించినప్పుడు ఓటమికి బౌలర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో సాధారణంగా బ్యాటర్లు కొన్ని మ్యాచ్‌ల్లో విజయాలు అందిస్తే, బౌలర్లు మిగతా మ్యాచ్‌ల్లో జట్టును గెలిపించాలని కైఫ్ వివరించాడు. అయితే ఈ సిరీస్‌లో భారత బౌలర్లు ఒక్క మ్యాచ్‌లోనూ తమ సత్తా చాటలేకపోతున్నారని విమర్శించాడు. ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లో రాణించాలంటే బౌలింగ్ విభాగం మెరుగుపడాల్సిందేనని తేల్చిచెప్పాడు. 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శనతో విజయం సాధించిన విషయాన్ని కైఫ్ గుర్తుచేశాడు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ వంటి బౌలర్లతో పాటు బ్యాటర్లు కూడా తమ వంతు పాత్ర పోషించారని చెప్పాడు. ప్రతి మ్యాచ్‌లోనూ




అందరు బ్యాటర్లు ఒకేసారి రాణించలేరని, నాలుగో టీ20లో సంజూ శాంసన్ బాగా ఆడిన విషయాన్ని ప్రస్తావించాడు. ఈ సిరీస్‌లో తొలి టీ20 మినహా మిగతా మ్యాచ్‌ల్లో భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. తొలి మ్యాచ్‌లో భారత్ 172 పరుగుల లక్ష్యాన్ని 14.4 ఓవర్లలోనే ఛేదించింది. రెండో టీ20లో వెస్టిండీస్ 249 పరుగుల లక్ష్యాన్ని భారత్ కాపాడుకోలేకపోయింది. మూడో మ్యాచ్‌లో భారత్ 223 పరుగులు చేయగా, వెస్టిండీస్ 14 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. నాలుగో మ్యాచ్‌లోనూ భారత బౌలింగ్ విభాగం ప్రత్యర్థి పరుగుల వేగాన్ని అడ్డుకోలేకపోయింది. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా బౌలింగ్ ప్రదర్శనపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. బౌలర్లు సరైన లైన్, లెంగ్త్‌లో బంతులు వేయలేకపోయారని తెలిపాడు. 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే సమయంలో బ్యాటర్లు ఒక ప్రణాళిక ప్రకారం ఆడాల్సి ఉంటుందని, ఛేదనలో జట్టు చూపిన దూకుడు బాగున్నప్పటికీ బౌలింగ్‌లో ప్రణాళికలను అమలు చేయలేకపోవడం వల్లే వెనుకబడిపోయామని పేర్కొన్నాడు.




# సెలెక్టర్ పదవికి ఇద్దరు దిగ్గజాల నో

## బీసీసీఐ ఆఫర్‌ను తిరస్కరించిన మాజీలు

బీసీసీఐకి కొత్త తలనొప్పి మొదలైంది. పురుషుల జాతీయ జట్టు సెలెక్షన్ కమిటీలో ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేసేందుకు ప్రముఖ ఆటగాళ్లను తీసుకురావాలన్న ప్రయత్నాలకు చుక్కెదురవుతోంది. దాదాపు 100 టెస్టులు ఆడిన ఇద్దరు మాజీ దిగ్గజ క్రికెటర్లను సెలెక్టర్ పదవి చేపట్టాలని బీసీసీఐ సంప్రదించగా, వారు ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించిన అజిత్ అగార్కర్, తన పదవీకాలాన్ని పొడిగించుకునేందుకు ఇష్టపడకపోవడంతో ఈ నెల ప్రారంభంలో అతడి పదవీకాలం ముగిసింది. దీంతో సెలెక్షన్ కమిటీలో ఒక స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో వెస్ట్ జోన్ కోటాలో సెలెక్టర్ పదవికి బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. అక్టోబర్ 14తో ఈ గడువు కూడా ముగిసింది. ప్రస్తుతం ఈ కమిటీలో ప్రజ్ఞాన్ ఓఝా (తాత్కాలిక ఛైర్మన్), ఆర్‌పీ సింగ్, అజయ్ రాత్రా, ఎస్ఎస్ దాస్ సభ్యులుగా కొనసాగుతున్నారు. సెలెక్టర్ల వంటి కీలక పదవుల్లోకి పేరున్న, అనుభవజ్ఞులైన ఆటగాళ్లను తీసుకురావాలని బీసీసీఐ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం వారి జీతభత్యాల ప్యాకేజీని కూడా గణనీయంగా పెంచేందుకు సుముఖత చూపింది. 2026-27 సంవత్సరానికి సెలెక్షన్ కమిటీల వార్షిక బడ్జెట్‌ను కూడా పెంచారు. అయినప్పటికీ, ఈ పదవిని చేపట్టేందుకు సీనియర్ ఆటగాళ్లు ముందుకు రాకపోవడం గమనార్హం. ఈ పదవికి పోటీలో ఉంటారని భావించిన మాజీ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ సైతం దరఖాస్తు చేసుకోలేదు. సెలెక్టర్ పదవికి దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం ఏడు టెస్టులు లేదా 30 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలి. అలాగే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరై ఐదేళ్లు పూర్తయి ఉండాలి. జీతభత్యాలు పెంచి, భారీ ఆఫర్లు ఇస్తున్నా సీనియర్ ఆటగాళ్లు విముఖత చూపడంతో ఐదుగురు సభ్యుల కమిటీని పూర్తి చేయడానికి బీసీసీఐ తన అన్వేషణను కొనసాగిస్తోంది.

# బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు

## కానీ మా దగ్గర ప్రతిభ ఉంది: సంజూ శాంసన్




హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమి అనంతరం వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, ఆయన లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని అంగీకరించాడు. ఆసియా క్రీడల తర్వాత వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శాంసన్ మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రా ఒక తరం గర్వించదగ్గ బౌలర్. అలాంటి ఆటగాడు జట్టులో ఉండటం మన అదృష్టం. ఆయనకు ప్రత్యామ్నాయం ఉండదు. కానీ, మన జట్టులోకి మంచి ప్రతిభ ఉన్న యువ ఆటగాళ్లు వస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. అలాగే గత కొన్ని మ్యాచ్‌లలో ప్రిన్స్ యాదవ్ కూడా ఆకట్టుకుంటున్నాడు. వారికి మనం ఎంత ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తే, వారు అంతగా రాటుదేలుతారు" అని వివరించాడు. బ్యాటింగ్ చేస్తూ గాయపడిన అర్ష్‌దీప్ గురించి మాట్లాడుతూ.. "అతను భుజానికి ఐస్ పెట్టుకుంటున్నాడు. త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నాను" అని తెలిపాడు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుత ఫామ్‌ను శాంసన్ ప్రశంసించాడు. "హోప్ చాలా బాగా ఆడుతున్నాడు. అతని ఆటను మనం గౌరవించాలి. పెద్దగా రిస్క్ తీసుకోకుండా, మంచి క్రికెటింగ్ షాట్లతో బౌలర్లను గౌరవిస్తూ పరుగులు చేస్తున్నాడు. అతడి బ్యాటింగ్‌కు కచ్చితంగా క్రెడిట్ ఇవ్వాలి. ప్రతి మ్యాచ్‌లో అతడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మేం దృష్టి సారిస్తున్నాం" అని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ.. 17వ ఓవర్‌లో తిలక్ వర్మ ఔట్ కావడమే కీలక మలుపు అని శాంసన్ అభిప్రాయపడ్డాడు. "తిలక్ ఔట్ అయ్యే వరకు మేం లక్ష్య ఛేదనలో సరైన మార్గంలోనే ఉన్నాం. ఓవర్‌కు 10-12 పరుగులు సులభంగా రాబడుతున్నాం. ఒత్తిడిలోనూ నితీశ్ రెడ్డి, తిలక్ వర్మ అద్భుతంగా ఆడారు" అని కొనియాడాడు. ఇదే సమయంలో ఫామ్ కోల్పోయిన ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు అండగా నిలిచాడు. "ఇషాన్, అభిషేక్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఓపెనర్లు. ఒక మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన ఆందోళన అవసరం లేదు. గత మ్యాచ్‌లోనే అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడాడు. ఇషాన్ నిలకడగా రాణిస్తున్నాడు" అని వారికి మద్దతుగా నిలిచాడు.

# నాయకత్వ పాత్ర నాకు అలవాటే

## టీమిండియా కెప్టెన్ మంధాన



పూర్తిస్థాయి నాయకత్వ బాధ్యత తనకు కొత్త సవాల్ కాదని టీమిండియా మహిళా జట్టు నూతన కెప్టెన్ స్మృతి మధాన స్పష్టం చేసింది. దాదాపు దశాబ్ద కాలంగా వైస్-కెప్టెన్‌గా జట్టులో కొనసాగుతున్నానని, ఈ అనుభవం ఇప్పుడు ఉపయోగపడుతుందని ధీమా వ్యక్తం చేసింది. తన బ్యాటింగ్‌పై కెప్టెన్సీ భారం పడబోదని స్పష్టం చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న రోజే, భారత జట్టు సారథిగా 29 ఏళ్ల మంధానను ఈ నెల ఆరంభంలో బీసీసీఐ నియమించింది. ఈ నేపథ్యంలో తాజాగా విలేకరులతో మాట్లాడిన మంధాన, తన కొత్త పాత్రపై స్పందించింది. "నేను గత పదేళ్లుగా వైస్-కెప్టెన్‌గా ఉన్నాను. కాబట్టి నాయకత్వ బృందంలో భాగస్వామిగానే ఉన్నా. అందుకే ఇది నాకు పూర్తిగా కొత్త విషయం అని చెప్పను. కచ్చితంగా ఇది ఒక మంచి అవకాశం. ఈ పాత్రకు నేను న్యాయం చేయగలనని ఆశిస్తున్నాను" అని పేర్కొంది. కెప్టెన్సీ తన బ్యాటింగ్‌ను మార్చదని మంధాన నొక్కిచెప్పింది. "నేను మైదానంలో కెప్టెన్‌గా ఉన్నప్పటికీ, నా బ్యాటింగ్‌లో ఎలాంటి మార్పులు ఉండవు. బంతి జోన్‌లో ఉంటే షాట్ ఆడేందుకు వెనుకాడను. జట్టుకు ఏది అవసరమో అలాగే ఆడతాను. 15 ఏళ్ల వయసులో నా కోచ్ చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి. 'నువ్వు బ్యాటింగ్ చేసేటప్పుడు నిన్ను నువ్వే కెప్టెన్‌గా భావించుకో, బాధ్యత తీసుకో' అని చెప్పేవారు. ఆ ఆలోచన ఎప్పుడూ మారలేదు," అని వివరించింది. త్వరలో జరగనున్న జింబాబ్వే సిరీస్‌పై మాట్లాడుతూ, ఇది తమకు ఒక ఉత్తేజకరమైన అవకాశమని మంధాన చెప్పింది. "జింబాబ్వేతో మేం మొదటిసారి ఆడుతున్నాం. వాళ్ల నుంచి కూడా మేం చాలా నేర్చుకోవచ్చు. కొన్నిసార్లు అసోసియేట్ దేశాలతో ఆడుతున్నప్పుడు వారు ఎలాంటి ఒత్తిడి లేకుండా క్రికెట్‌ను ఆస్వాదిస్తారు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు మాకు ఆరు టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి. కాబట్టి రాబోయే మూడు నెలల్లో భారత జట్టుగా మా ప్రమాణాలను నిర్దేశించుకుంటాం" అని మంధాన వివరించింది. 2025 వన్డే ప్రపంచకప్‌లో 434 పరుగులతో రెండో అత్యధిక స్కోరర్‌గా నిలిచిన మంధాన, అదే ఏడాది మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది.



# ఢిల్లీకి టైటిల్ అందిస్తా

## అసిస్టెంట్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన యువరాజ్

భారత క్రికెట్ మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఐపీఎల్ 2027 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్, బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ.. జట్టులో గెలుపు సంస్కృతిని పెంపొందించి, ఛాంపియన్‌షిప్ సాధించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హెడ్ కోచ్ సౌరవ్ గంగూలీ నేతృత్వంలో యువీ తన బాధ్యతలను నిర్వహించనున్నాడు. తనకు ఈ అవకాశం లభించిన తీరును వివరిస్తూ.. "దాదా నన్ను పిలిచి, 'నా అసిస్టెంట్‌గా ఉంటావా?' అని అడిగాడు. దానికి నేను .. 'గత 25 ఏళ్లుగా మీకు అసిస్టెంట్‌గానే ఉన్నాను కదా, బహుశా అదే పని కొనసాగిస్తానేమో' అని సరదాగా సమాధానమిచ్చాను. ఈ బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతృప్తిని ఇస్తోంది" అని యువరాజ్ పేర్కొన్నాడు. గత కొన్నేళ్లుగా తాను కోచింగ్ పాత్ర కోసం సిద్ధమవుతున్నానని, గంగూలీ తనకు ఎప్పుడూ పెద్దన్న వంటి వారని, ఆయన దిశానిర్దేశంలో జట్టు మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశాడు. కోచింగ్ విధానం గురించి వివరిస్తూ.. "ఈ స్థాయిలో ప్రతి ఆటగాడికి అద్భుతమైన నైపుణ్యం ఉంటుంది. ఫ్రాంచైజీ ఒక ఆటగాడిని ఎంపిక చేసిందంటే, వారి సామర్థ్యంపై పూర్తి నమ్మకం ఉందని అర్థం. ఆటగాళ్లు కూడా తమ ప్రతిభపై తాము విశ్వాసం ఉంచుకోవాలి" అని యువరాజ్ సూచించాడు. ఢిల్లీ జట్టు బ్యాటింగ్ లైనప్‌ను ప్రశంసిస్తూ.. కేఎల్ రాహుల్, ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు జట్టులో ఉండటం సానుకూల అంశమని పేర్కొన్నారు. "ముందుగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడం మా ప్రథమ లక్ష్యం. అయితే, అంతిమంగా ఛాంపియన్‌షిప్ గెలవడానికే మేమిక్కడ ఉన్నాం. ఒత్తిడిని అధిగమించి రాణించే, విజయం పట్ల బలమైన సంకల్పం ఉన్న జట్టును సిద్ధం చేయాలనుకుంటున్నాను" అని యువరాజ్ సింగ్ స్పష్టం చేశాడు.

# ఆంధ్ర, కర్ణాటక రంజీ మ్యాచ్ డ్రా

## ఆకట్టుకున్న ఎస్.వి. రాహుల్

మూలపాడు వేదికగా ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగో రోజు ఆటలో కర్ణాటక బ్యాటర్ కరుణ్ నాయర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో రాణించడంతో ఆంధ్ర విజయావకాశాలు చేజారాయి. ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆంధ్ర ఆటగాడు ఎస్.వి. రాహుల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును దక్కించుకున్నాడు. నాలుగో రోజు ఆటలో కర్ణాటక తమ రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. ఆంధ్ర బౌలర్లలో ఎల్. మోహన్ 5 వికెట్లతో సత్తా చాటగా, ఎస్. కుమార్ 3 వికెట్లు, టి. విజయ్ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆంధ్ర జట్టు, ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. ఎస్.వి. రాహుల్ 85 బంతుల్లో 5 ఫోర్లతో 35 పరుగులు చేసి మరోసారి ఆకట్టుకున్నాడు. కర్ణాటక బౌలర్లలో శిఖర్ శెట్టి రెండు వికెట్లు తీయగా, బత్కళ్, బజాజ్ చెరో వికెట్ దక్కించుకున్నారు. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు నాలుగు రోజుల పాటు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యంగా కేఎల్ రాహుల్‌ను చూసేందుకు అభిమానులు విశేష ఆసక్తి కనబరిచారు. భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌లను రాష్ట్రంలో నిర్వహించాలని వారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను కోరారు.



## ట్రెడిషనల్ లుక్‌లో రష్మిక రాయల్ వైబ్!

రష్మిక మందన్న.. నేషనల్ క్రష్ కాదు బాక్స్ ఆఫీస్ క్వీన్ అనే రేంజ్ లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కన్నడ బ్యూటీ అయిన రష్మిక మందన్న ఇటు తెలుగు, హిందీ చిత్రాలతో ఆడియన్స్ హృదయాలను దోచుకుంటుంది. భాషతో సంబంధం లేకుండా పాన్ ఇండియా హీరోయిన్గా మరింత బిజీగా మారిన రష్మిక మందన్న వివాహం తర్వాత తన భర్తతో కలిసి నటిస్తున్న తొలి చిత్రం రణబాలి. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో.. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 16న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. వివాహం తర్వాత రాబోతున్న సినిమా కావడంతో ఈ సినిమాకి మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అటు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కూడా దేవాలయాలను సందర్శిస్తూ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నారు. అందులో భాగంగానే నేడు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సందర్శించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్న ఈ జంట.. కాసేపటి క్రితం సత్యసాయిబాబా ప్రశాంతి నిలయంలో సందడి చేశారు.. మరొకవైపు సేవా కార్యక్రమాలను చేపడుతూ వేగంగా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. అందులో భాగంగానే ప్రాజెక్టు అన్నపూర్ణ పేరుతో ఏకంగా 400 కుటుంబాలను రష్మిక దత్తత తీసుకోవడమే కాకుండా మూడు నెలలకు సరిపడా ఒక్కో కుటుంబానికి అవసరమయ్యే నిత్యావసర సరుకులను కూడా అందించారు. ప్రత్యేకించి ఎనిమిది ప్రాంతాల నుండి ఎంపిక చేసిన కుటుంబాలకు ఈ ప్రత్యేక నిత్యావసర కిట్ ఇవ్వడం జరిగింది. ఇలా అటు సోషల్ మీడియా ద్వారా అటు నేరుగా ప్రజలను కలుస్తూ మరింత ఆదరణ సొంతం చేసుకుంటుంది ఈ జంట. ఇకపోతే మరొకవైపు తన గ్లామర్ తో హుందాతనంతో కూడా ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది రష్మిక. ఈ క్రమంలోనే తాజాగా తన జయమ్మ పాత్రను ప్రేక్షకులు ఖచ్చితంగా ఇష్టపడతారు అంటూ ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ట్రెడిషనల్ వేర్ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి



## 'సేవ్ ది టైగర్స్' దర్శకుడితో మూవీ.. మెగా మేనల్లుడి ప్లాన్ ఇదే..

మెగా మేనల్లుడు సాయిదుర్గా తేజ్ తన నెక్స్ట్ మూవీతో మరో కొత్త ప్రయోగానికి సిద్ధమయ్యారు. సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్ తో గుర్తింపు తెచ్చుకున్న తేజ కాకుమానుతో కలిసి సినిమా చేయబోతున్నారు. తన బర్త్ డే సందర్భంగా ఆ ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేశారు. ఏకే ఎంటర్టైన్మెంట్స్ నిర్మించనున్న ఆ మూవీపై అప్పుడే ఆడియన్స్ లో మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. నిజానికి సాయిదుర్గా తేజ్ గత కొంతకాలంగా తన సినిమాలను స్పెషల్ గా సెలెక్ట్ చేస్తున్నారు. ఒకే తరహా కథలకు పరిమితం కాకుండా కొత్త స్టోరీలు, భిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ట్రై చేస్తున్నారు. విరూపాక్ష వంటి విభిన్నమైన కథతో విజయం అందుకున్న ఆయన.. ప్రస్తుతం సంబరాల ఏటిగట్టు సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ సినిమా తర్వాత కూడా కొత్త కథలతో ముందుకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు ఇప్పుడు కొత్త మూవీ అనౌన్స్మెంట్ తో క్లియర్ గా తెలుస్తోంది. సాధారణంగా స్టార్ హీరోలు ఎక్స్పీరియన్స్ ఉన్న దర్శకులతో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే సాయిదుర్గా తేజ్ మాత్రం కొత్త ఆలోచనలతో వచ్చే దర్శకులకు కూడా ఛాన్స్ ఇస్తున్నారు. తేజ కాకుమాను ఇప్పటివరకు నటుడిగా, వెబ్ సిరీస్ దర్శకుడిగా తన టాలెంట్ చూపించారు. ఇప్పుడు బిగ్ స్క్రీన్ పై తన ఆలోచనలను సినిమా రూపంలో చూపించనున్నారు. తేజ కాకుమాను బాహుబలి వంటి చిత్రాల్లో నటించారు. అనంతరం సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్ కు దర్శకత్వం వహించి ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఫన్ అండ్ ఫ్యామిలీ రిలేషన్స్ తో సాగే స్టోరీని ఎంటర్టైనింగ్ గా చూపించడంలో ఆయనకు గుర్తింపు ఉంది. ఇప్పుడు సినిమా డైరెక్టర్ గా తన తొలి ప్రయత్నంలోనే సాయి దుర్గా తేజ్ తో వంటి హీరోతో వర్క్ చేసే ఛాన్స్ దక్కించుకున్నారు. స్పెషల్ గా స్టోరీ రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన వాణీ కపూర్

బాలీవుడ్ హాట్ బ్యూటీ వాణీ కపూర్ గ్లామర్ అండ్ ఎలిగెంట్ లుక్స్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంది. బాలీవుడ్‌లో స్టార్ స్టేటస్ కోసం సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఈ భామ, ఇటీవల సరైన హిట్ లేక కెరీర్‌లో ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. అయినప్పటికీ తన ఫ్యాషన్ సెన్స్‌తో నిత్యం వార్తల్లో నిలుస్తూనే ఉంది. తాజాగా సంప్రదాయ నేవీ అండ్ గోల్డ్ కలర్ లెహంగాలో వాణీ కపూర్ పంచుకున్న రాజసం ఉట్టిపడే ఫొటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఆ లేటెస్ట్ ఫొటోషూట్ అండ్ కెరీర్ ముచ్చట్లు ఇప్పుడు చూద్దాం.. తాజాగా షేర్ చేసిన ఫొటోషూట్‌లో వాణీ కపూర్ ఎంతో క్లాసిక్‌గా, ఎలిగెంట్‌గా కనిపిస్తున్నారు. సంప్రదాయబద్ధంగా ఎంబ్రాయిడరీ చేసిన నేవీ అండ్ గోల్డ్ కలర్ లెహంగా-చోలీ ధరించి అభిమానులను కట్టిపడేస్తున్నారు. వేవీ హెయిర్‌ను ఒక వైపు వేసుకుని, గోల్డెన్ లైటింగ్‌లో ఆమె ఇచ్చిన పోజులు రాయల్ లుక్‌ను తలపిస్తున్నాయి. ఇక గత పుష్కర కాలంగా వెండితెరపై మెరుస్తున్న ఈ భామలో ఏమాత్రం తగ్గని ఆత్మవిశ్వాసం, రాయల్ గ్రేస్ ఈ ఫొటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. హృతిక్, రణవీర్, అక్షయ్ కుమార్, అజయ్ దేవగన్ వంటి అగ్ర హీరోలతో నటించినప్పటికీ వాణీ కపూర్‌కు రావలసినంత స్టార్‌డమ్ దక్కలేదు. ఇక 'షంషేరా', 'ఖేల్ ఖేల్ మే' వంటి సినిమాలు నిరాశపరిచాయి. గత ఏడాది 'రైడ్ 2' సినిమా మంచి విజయాన్ని అందించినా, ఆ తర్వాత వచ్చిన 'అబీర్ గులాల్' ఆమె కెరీర్‌పై ప్రభావం చూపించింది. సక్సెస్ లేక అవకాశాలు తగ్గుతున్న వేళ, సోషల్ మీడియా వేదికగా ఫొటోషూట్లతో ఎప్పటికప్పుడు ట్రెండింగ్‌లో ఉంటోంది. సినిమాల్లో విజయాలు తగ్గినప్పటికీ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది వాణీ కపూర్. నెట్‌ఫ్లిక్స్ థ్రిల్లర్ సిరీస్ 'మండల మర్డర్స్'తో ఓటీటీ డెబ్యూ చేసి మెప్పించింది. ఇటీవల ఆమె నటించిన 'సర్వగుణ్ సంపన్' అనే సోషల్ కామెడీ చిత్రంతో అలరించారు. ఇక 'బద్తమీజ్ గిల్' అనే మరో క్రేజీ ప్రాజెక్ట్ లైన్ లో ఉంది. ఫ్లాపుల నుంచి తేరుకుని ఈ సినిమాలతో మళ్లీ బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాలని ఆమె చూస్తోంది.



## ట్రావెల్ మోడ్‌లో మీనాక్షి చౌదరి.. హనోయ్‌లో ఫుల్ ఎంజాయ్!

టాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి వరుస హిట్లు, క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. వరుస షూటింగ్‌ల నుంచి కాస్త విరామం తీసుకున్న ఈ అందాల భామ, తాజాగా వియత్నాంలోని హనోయ్ వీధుల్లో వెకేషన్ ఎంజాయ్ చేస్తున్నారు. అక్కడ వీధుల్లో తిరుగుతూ, కాఫీలు తాగుతూ, వింటేజ్ పుస్తకాల షాపులను సందర్శిస్తూ దిగిన క్యాజువల్ అండ్ బోహో-స్టైల్ పిక్స్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్నాయి. ఆ లేటెస్ట్ ట్రావెల్ విశేషాలు, ఆమె కెరీర్ ముచ్చట్లు ఇప్పుడు చూద్దాం. "హనోయ్ వీధుల్లో కొన్ని రోజులు తిరిగాను.. అందమైన కెఫేలు, వింటేజ్ బుక్ స్టోర్లు చూశాను. అలాగే అక్కడ తిండి, కాఫీ చాలా అద్భుతంగా ఉన్నాయి" అంటూ మీనాక్షి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పిక్స్ షేర్ చేశారు. ఈ అవుట్‌డోర్ ఫొటోల్లో ఆమె ఎంతో కేర్‌ఫ్రీగా, సూర్యకాంతి నుంచి కళ్లను కాపాడుకుంటూ చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. ఇక ఈ హనోయ్ ప్రయాణంలో ఆమె ఇచ్చిన నాచురల్ పోజులు, ఎంజాయ్ చేసిన విధానం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. హనోయ్ ప్రయాణంలో మీనాక్షి వేసుకున్న స్టైలిష్ అవుట్‌ఫిట్ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షించింది. బ్లాక్ ట్యాంక్ టాప్, డెనిమ్ షార్ట్స్‌పైకి ఒక కిమోనో కార్డిగాన్ వేసుకుని ఆమె కనిపించారు. దానికి మ్యాచింగ్‌గా క్రాస్‌బాడీ బ్యాగ్, సింపుల్ ఫ్లాట్ శాండల్స్ ధరించి ఎంతో క్యూట్‌గా మెరిసిపోయారు. ఇక ఈ ఫొటోలు చూసిన ఫ్యాన్స్ "సో బ్యూటిఫుల్", "వావ్, చాలా క్యూట్‌గా ఉన్నారు" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA